PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 7 | విజయవాడ, బుధవారం 7 ఆగస్టు 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 7 August 2024 | Rs

2019-2023లో 45.8 శాతం

పెరిగిన అత్యాచారాలు

- హడలెత్తించిన వైట్‌కాలర్, సైబర్ నేరాలు
- నేరతీవ్రత, వేధింపులూ విపరీతం

3

ఫైనల్‌కు వినేశ్ ఫోగాట్

మహిళా రెజ్లర్ వినేశ్ ఫోగాట్ అదరగొట్టింది. మహిళల 50కిలోల ఫ్రిస్టైల్ విభాగం ఫైనల్‌కు చేరి పతకం ఖాయం చేసింది. దీంతో ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన తొలి మహిళా రెజ్లర్‌గా వినేశ్ ఫోగాట్ నిలిచింది. మంగళవారం జరిగిన సెమీస్‌లో ఫోగాట్ 5-0తో యూస్నీ లీస్ గుజ్మాన్(క్యూబా)ను ఓడించింది. అంతకుముందు క్వార్టర్స్‌లో 7-5తో లివచ్ ఒక్సానా(ఉక్రెయిన్)ను, ప్రి క్వార్టర్స్‌లో నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్ సుసాకీ(జపాన్)ను ఓడించింది.

మంగళగిరి ఎయిమ్స్‌లో

38 మంది వైద్యుల రాజీనామా

- 602 పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వివిధ కారణాలతో మంగళగిరి ఎయిమ్స్‌లో గత మూడు సంవత్సరాల్లో 38 మంది డాక్టర్లు రాజీనామా చేశారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ ఈ విషయం తెలిపారు. అయితే, రాజీనామాలకు కారణాలను మాత్రం ఆమె పేర్కొనలేదు. ఈ సంస్థలో ఇప్పటికే 125 ఫ్యాకల్టీ, 477 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆమె తెలిపారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా ఏర్పాటైన మంగళగిరి ఎయిమ్స్‌లో అనేక సమస్యలున్న విషయం తెలిసిందే. సిబ్బందికి నివాసాల కొరతతోపాటు ఆసుపత్రిలో కూడా అనేక ప్రాథమిక సమస్యలున్నాయి. గత మూడేళ్లలో మంగళగిరిసహా దేశంలోని ఉన్న 20 ఎయిమ్స్‌ల్లో 422 మంది డాక్టర్లు రాజీనామా చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న 20 ఎయిమ్స్‌ల్లో 2,114 ఫ్యాకల్టీ, 17,138 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

'హంద్రీనీవా'పై నిర్లక్ష్యం

- పర్యవేక్షణ లోపంతో కాలువకు గండి
- తీవ్రంగా నష్టపోయిన రైతులు

2

బంగ్లాదేశ్

పార్లమెంటు రద్దు

తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు

- ముఖ్య సలహాదారుగా మహ్మద్ యూనస్
- కొనసాగుతున్న హింస
- ప్రభుత్వ కూర్పుపై విద్యార్థి సంఘ నేతలతో ఆర్మీ చీఫ్ చర్చలు
- తాత్కాలిక ప్రభుత్వ ఆధ్వర్యంలో పార్లమెంటు ఎన్నికలు : అధ్యక్షుడు వెల్లడి

ఢాకాలో మంగళవారం కొనసాగిన హింసాగ్ని

ఢాకా : ఉవ్వెత్తున ఎగసిన విద్యార్థుల ఆందోళనలు, హింస, నిర్బంధాల నడుమ ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేశాక తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు వీలుగా బంగ్లాదేశ్ పార్లమెంటును రద్దు చేశారు. బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ మంగళవారం ఈ మేరకు ప్రకటించారు. రక్షణ రంగానికి చెందిన అధిపతులు, వివిధ పార్టీల నేతలు, విద్యార్థి సంఘ నాయకులు, పౌర సమాజ ప్రతినిధులతో చర్చించిన మీదట ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. తాత్కాలిక ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుగా నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్‌ను నియమించారు. పలు ప్రాంతాల్లో హింసాత్మక సంఘటనలు మంగళవారం కూడా కొనసాగాయి. దీంతో ఢాకా నగరంలో 20 మంది మృతి చెందారు. మరోవైపు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సైన్యం నేతృత్వం వహించే ఏ తాత్కాలిక ప్రభుత్వమూ తమకు ఆమోద యోగ్యం కాదని ఆందోళనలకు నాయకత్వం వహించిన విద్యార్థి సంఘం నేతలు స్పష్టం చేయడంతో ఆర్మీ మల్లగుల్లాలు పడుతోంది. ఈ విషయమై ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్ విద్యార్థి నేతలతో చర్చలు జరపనున్నట్లు మిలిటరీ వర్గాలు తెలిపాయి. నిరసనకారుల మిగతా 5లో

నిశితంగా పరిశీలిస్తున్నాం : ఎస్ జైశంకర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలను నిశితంగా పరిశీలిస్తున్నామని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పార్లమెంటుకు తెలిపారు. మంగళవారం ఆయన తొలుత రాజ్యసభలోనూ, ఆ తరువాత లోక్‌సభలోనూ ప్రకటన చేశారు. బంగ్లాదేశ్‌లో దాదాపు 19,000 మంది భారతీయులు ఉన్నారని, వీరిలో దాదాపు తొమ్మిది వేల మంది విద్యార్థులేనని అన్నారు. అక్కడి మైనార్టీల స్థితిగతులను కూడా పర్యవేక్షిస్తున్నామన్నారు. శాంతి భద్రతలను పునరుద్ధరించే వరకూ మన దేశం ఒత్తిడి చేస్తుందని తెలిపారు.

విపత్తులను ఐక్యంగా ఎదుర్కొంటున్న

కేరళ ప్రజలకు జేజేలు

ప్రశంసించిన సిపిఎం పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు వాటిని ఎదుర్కోవడంలో ప్రజలంతా ఏక తాటిపై నిలిచి ఎలా పోరాడతారో కేరళ ప్రజలు మరోసారి చాటిచెప్పారని సిపిఎం ప్రశంసించింది. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన సమావేశం అనంతరం పార్టీ పొలిట్‌బ్యూరో ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. ఒకవైపు బాధితులకు సహాయ సహకారాలు అందిస్తూనే మరోవైపు ప్రజల పునరావాసం కోసం ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం విస్తృతంగా చేస్తున్న కృషి గురించిన నివేదికలను పొలిట్‌బ్యూరో తెలుసుకుంది. ఈ సహాయక చర్యల్లో అవిశ్రాంతంగా కృషి చేస్తున్న ప్రజలను, ప్రభుత్వాన్ని పొలిట్‌బ్యూరో అభినందించింది.

కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేంద్ర హోం మంత్రి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా నిరసించింది. మంత్రి చెబుతున్నవన్నీ తప్పుడు మాటలు, అసత్యాలేనని తేలింది.

ప్రత్యేక బ్యాంక్ ఖాతాతో పార్టీ ఏర్పాటు చేసిన వయనాడ్ రిలీఫ్ ఫండ్‌కు ఉదారంగా విరాళాలివ్వాల్సిందిగా ప్రజలకు పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

బంగ్లాదేశ్‌లో ప్రజా తిరుగుబాటు

హసీనా నేతృత్వంలోని ప్రభుత్వ నిరంకుశత్వ, అవినీతికర పాలనకు వ్యతిరేకంగా విద్యార్థుల నేతృత్వంలో సాగించిన ప్రజా తిరుగుబాటులో ఆమె పదవీచ్యుతురాలయ్యారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. బంగ్లాదేశ్‌లో పరిస్థితిని ప్రజల ఆకస్మిక ఆగ్రహంగా పొలిట్‌బ్యూరో అభివర్ణించింది. సామూహిక నిరసనలు, ఆందోళనలను క్రూరంగా అణచివేయడం వల్ల 400మందికి పైగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల పార్టీ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది.

దేశంలో శాంతి సుస్థిరతలను పునరుద్ధరించేందుకు ప్రజాస్వామ్య, లౌకికవాద శక్తులు కలసి కట్టుగా కృషి చేయాల్సి వుంది. విదేశీ శక్తుల మద్దతుతో లబ్ది పొందాలని చూస్తున్న మితవాద, ఛాందసవాద శక్తుల నీచపుటెత్తుగడలను తిప్పికొట్టాలంటే ఇది తప్పనిసరని పేర్కొంది.

ఏప్రిల్ 2 నుంచి మదురైలో పార్టీ అఖిలభారత మహాసభ

సిపిఎం 24వ అఖిల భారత మహాసభ వచ్చే ఏడాది ఏప్రిల్ 2 నుండి 6 వరకు తమిళనాడులోని మదురైలో జరుగుతాయని పొలిట్‌బ్యూరో మంగళవారం వెల్లడించింది.

ఎస్‌సి ఉప వర్గీకరణ-సుప్రీం తీర్పుపై...

స్పష్టమైన మార్గ దర్శక సూత్రాల ప్రాతిపదికన షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణపై ఏడుగురు సభ్యుల సుప్రీం కోర్టు ధర్మాసనం (6-1) ఇచ్చిన తీర్పును పొలిట్‌బ్యూరో సమర్థించింది. అదే సమయంలో, ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్ పరిధిలో క్రీమీ లేయర్‌ను ప్రవేశపెట్టేందుకు పార్టీకి గల స్థిరమైన వ్యతిరేకతను పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది. తీర్పులో భాగంగా కాకపోయినా, ఏడుగురు న్యాయమూర్తుల్లో నలుగురు క్రీమీ లేయర్‌ను ప్రవేశపెట్టేందుకు విడివిడిగానైనా అనుకూలంగానే అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

మతోన్మాద పోకడలను దూకుడుగా అనుసరించడంపై

మోడీకి, బిజెపికి భారత ప్రజలు ఈసారి స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. దాంతో ఎన్‌డిఎ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది. వాస్తవం ఇలా ఉంటే, ఏమీ మారలేదు, అంతా సర్వ సాధారణంగా వుంది అన్నట్లుగా మిగతా 5లో

అసైన్డ్, ఇనామ్ భూములపై విచారణ

- ఆరు జిల్లాలపై సర్కారు ఫోకస్
- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో అసైన్డ్ ,ఇనామ్ భూముల క్రమబద్ధీకరణలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కలెక్టర్ల సమావేశంలో ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నేతృత్వంలో విచారణ కమిటీలను ఏర్పాటు చేయాలని, మెంబర్లుగా అసిస్టెంట్ రిజిస్ట్రార్, /తహసీల్దార్/ ఒక మండల సర్వేయర్‌ను నియమించాలని ప్రభుత్వం పేర్కొంది. జిల్లాల్లో ఒక మండలాన్ని ఎంపిక చేసుకుని, ఆ కమిటీ అక్కడ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఫిర్యాదులు వస్తే వాటిని పరిష్కరించాలని సూచించింది. నెల రోజుల్లోపు ఈ ప్రక్రియ పూర్తి చేసి ప్రభుత్వానికి సమగ్రనివేదిక అందచేయాలని కలెక్టర్లను ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక భూ బదలాయింపులు జరిగిన జిల్లాలుగా తిరుపతి, చిత్తూరు, వైఎస్‌ఆర్, అన్నమయ్య, ప్రకాశం, శ్రీసత్యసాయి జిల్లాలను ప్రభుత్వం గుర్తించింది. (ఈ జిల్లాలపై కేంద్రీకరించే తాజాగా విచారణ ప్రక్రియను నిర్వహించనున్నారు. గత ఐదేళ్ళకాలంలో అసైన్డ్, 22(ఎ), ఇనామ్ భూములు 13.59లక్షల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించి ఆయా భూముల యజమానులకు భూ యాజమాన్యపు హక్కులును గత ప్రభుత్వం కల్పించిన సంగతి తెలిసిందే. ఇందులో 25,230 ఎకరాల్లో రిజిస్ట్రేషన్ కూడా పూర్తయ్యాయి. తాజాగా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిషేధిత భూములను ఫ్రీ హోల్డ్ చేస్తూ యాజమాన్యపు హక్కులు కల్పించిన ఫైళ్ల అగ్నికి ఆహుతి కావడం, ఓ మాజీ మంత్రి అనుచరుల ఇళ్లలో ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లు దొరకడంతో అప్రమత్తమైన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా అసైన్డ్ ల్యాండ్స్ 36,36,749 ఎకరాలు ఉన్నాయని రెవిన్యూశాఖ నిర్ధారించింది. ఇప్పటి వరకు అందిన గణాంకాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా భూ యాజమాన్యపు హక్కులు 9,93,285 ఎకరాలకు కల్పించారు. వీటితో పాటు గ్రామ సర్వీసు ఇనామ్ ల్యాండ్1,38,848 ఎకరాలు, చుక్కల భూములు 1,94,232 ఎకరాలు, షరతులగల పట్టా భూములు 33,441 ఎకరాలు కలిపి మొత్తం 13,59,806 ఎకరాల భూములకు గత ప్రభుత్వం భూ యాజమాన్యపు హక్కులు కల్పించింది. ఫ్రీ హోల్డ్ జరిగిన భూముల్లో అత్యధిక శాతం వైసిపి నేతలు, వారి అనుచరులు, నేతల బినామీలకు చెందిన భూములుగా ప్రభుత్వం భావిస్తోంది.

అత్యధికంగా ఫ్రీ హోల్డ్ చేసిన జిల్లాలు, భూముల విస్తీర్ణం వివరాలు

జిల్లా పేరు	ఎలిజిబుల్ అసైన్డ్ ల్యాండ్	ఫ్రీహోల్డ్ చేసిన భూమి (ఎకరాలు)	గ్రామ సర్వీస్ ఇనామ్ ల్యాండ్	చుక్కల భూమి	షరతుల గల పట్టాభూమి	ఫ్రీహోల్డ్ చేసిన మొత్తం భూమి (ఎకరాలు)
తిరుపతి	96,275	69,012	2,308	7,832	18	79,169
చిత్తూరు	1,90,545	1,59,328	359	990	0	1,60.677
వైఎస్‌ఆర్	99,843	30,938	26,623	18,559	200	76,321
అన్నమయ్య	1,41,478	1,26,227	4818	28,882	2514	1,62.442
ప్రకాశం	1,74,934	1,39,063	9,525	37,622	77	1,86,286
శ్రీసత్యసాయి	2,51,214	2,29,448	5943	22,011	91	2,57.042

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జలరవాణాకు మాస్టర్‌ప్లాన్

- త్వరలో విధాన రూపకల్పన
- ఇన్‌లాండ్ వాటర్‌వేస్‌కు ప్రాధాన్యత
- సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జలరవాణ(మారిటైం) కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖపై మంగళవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీనిలో భాగంగా నూతన విధానాన్ని త్వరలో తీసుకురానున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా రద్దుచేసిన, నిలిపేసిన ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దశలో తక్షణం చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు నిలిచిపోవడం వల్ల సంపద సృష్టి దెబ్బతిందని, అది వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అతిపెద్ద నష్టమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మారిటైంబోర్డు, మారిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లు కూడా గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైనాయని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని స్పెషల్ పర్పస వెహికల్ (ఎస్‌పివి) ద్వారా వీటి అభివృద్ధికి తక్షణం చర్యలు మిగతా 5లో

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీ ఈ నెల 13, పరిశీలన 14, ఉపసంహరణ గడువు 16 అని వెల్లడించారు. 30వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుంది. సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఆగస్టు ఆరు నుంచి 30వ తేదీ వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

అల్ట్రాటెక్ ఘటనలో మరో

కార్మికుడు మృతి

6

- ఐదుకు చేరిన మృతుల సంఖ్య

మూడు సెషన్లలో

రూ.22 లక్షల కోట్లు ఫట్

3

మద్యం దుకాణాల్లో రిజర్వేషన్!

- గౌడ, ఈడిగ సామాజిక తరగతులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మద్యం దుకాణాల కేటాయింపుల్లో కొన్ని సామాజిక తరగతులకు రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలో ప్రకటించనున్న నూతన మద్యం పాలసీలో ఈ మేరకు ప్రతిపాదించనున్నారని సమాచారం. మద్యం పెద్ద ఆదాయ వనరుగా మారడంతో రెండు దశాబ్దాలుగా ఈ వ్యాపారంలోకి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు చొరబడ్డారు. దీంతో సాంప్రదాయంగా కల్లుగీత వృత్తిలో వుంటున్న వారు ఈ రంగంలో కొనసాగలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో గౌడ, ఈడిగలకు ప్రాధాన్యత ఇచ్చేలా మద్యం దుకాణాల కేటాయింపుల్లో రిజర్వేషన్ విధానాన్ని అమలుచేయాలని నిర్ణయించినట్లు సమాచారం. సోమవారం జరిగిన కలెక్టర్ల రాష్ట్రస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఈ దిశలో కొన్ని సూచనలు చేశారు. గౌడ, ఈడిగ సామాజిక తరగతులవారు సాంప్రదాయంగా కల్లు విక్రయాలు చేస్తారని, వారికి మద్యం షాపుల్లో 15 నుంచి 20 శాతం షాపులను కేటాయించే అంశంపై ఆలోచన చేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే పొరుగున ఉన్న తెలంగాణలో ఈ తరహా విధానం అమలులో ఉండటం గమనార్హం. ఆ రాష్ట్రంలో మద్యం దుకాణాల్లో గౌడ సామాజిక తరగతికి 15 శాతం, ఎస్‌సిలకు 10, ఎస్‌టిలకు 5 శాతం షాపులు కేటాయిస్తున్నారు. రాష్ట్రంలోనూ ఈ తరహా విధానాన్నే అమల్జేయనున్నట్లు సమాచారం.

గడిచిన ఐదేళ్ల కాలంలో మద్యం విక్రయాల్లో చోటుచేసుకున్న అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సిబిసిఐడి విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. మరోవైపు నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు ఇచ్చేలా ఆరు రాష్ట్రాల్లో మద్యం విధానాన్ని అధ్యయనం చేసేందుకు నాలుగు కమిటీలను ఏర్పాటు చేసింది. ఉత్తర ప్రదేశ్, రాజస్తాన్, కేరళ, తమిళనాడు, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాల్లో ఆయా కమిటీలు అధ్యయనాన్ని ప్రారంభించింది. ఆ కమిటీలు ఈ నెల 12 తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నాయి. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించనుంది.

విదేశీ విమాన సంస్థలు రూ.10 వేల కోట్ల జిఎస్‌టి ఎగవేత..!

న్యూఢిల్లీ : భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విదేశీ విమానయాన సంస్థలు దాదాపు రూ.10,000 కోట్ల వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) ఎగవేశాయి. దీనిపై ఆయా సంస్థలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ (డిజిజిఐ) నోటీసులు జారీ చేసింది. ఇందులో బ్రిటిష్ ఎయిర్‌వేస్, లుఫ్తా న్సా, ఒమన్ ఎయిర్, ఎమిరేట్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ తదితర సంస్థలున్నాయి. 2017- 24 మార్చి మధ్య కాలానికి పన్ను చెల్లించడంలో ఆయా కంపెనీలు విఫలమైన నేపథ్యంలో డిజిజిఐ ఈ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. చట్టపరంగా ఒక సంస్థ నుంచి మరో సంస్థకు చేసే చెల్లింపులు జిఎస్‌టికి లోబడే ఉంటాయని కానీ.. అవి తమకు వర్తించవని విమానయాన సంస్థలు వాదిస్తున్నాయి. డిజిజిఐ నోటీసులు తమను తీవ్ర నిరాశకు గురి చేశాయని ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఎటిఎ) తెలిపింది. ప్రపంచం లో ఏ దేశంలోనూ ఈ విధానం లేదని, సమస్యను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

పెన్షన్ రూ.9 వేలు చెల్లించాల్సిందే

- ఇపిఎఫ్ 95 పెన్షనర్ల ఆందోళన
- సిపిఎం, టిడిపి, కాంగ్రెస్ ఎంపిల సంఘీభావం

జంతర్ మంతర్ వద్ద ఇపిఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న పెన్షనర్లు. ప్రసంగిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

డిఎతో సహా రూ.9 వేలు పెన్షన్ చెల్లించాలని ఇపిఎఫ్ పెన్షన్‌దారులు మంగళవారం డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద ఇపిఎఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు చేబూని పెద్దపెట్టున నినాదాలు చేశారు. సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, వి. శివదాసన్, టిడిపి ఎంపి అప్పలనాయుడు, కాంగ్రెస్ ఎంపి మల్లు రవి తదితరులు పెన్షనర్లకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి అతుల్ దిఘే మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 75 లక్షల మంది ఇపిఎఫ్ పెన్షనర్లు ఉంటే వారిలో 35 లక్షల మందికి వెయ్యి రూపాయలు కూడా పెన్షన్ అందడం లేదని విమర్శించారు. రూ.9 వేలు పెన్షన్ ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా డిఎ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జివో 609ని రద్దు చేయాలని, మొత్తం వేతనానికి పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఉద్యోగ విరమణ తరువాత భార్యతో కలిసి ప్రయాణించేందుకు రైల్వే రాయితీ ఇవ్వాలని అన్నారు. వైద్య సదుపాయం కల్పించాలని, నిత్యావసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా అందించాలని కోరారు. ఇపిఎఫ్ నిధిని ప్రైవేటీకరణ చేయొద్దని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, హర్యానా, ఢిల్లీ, పుదుచ్చేరి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వేలాది మంది పెన్షనర్లు, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డి. మోహనన్, ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఏపి ప్రధాన కార్యదర్శి కె. సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో యూ ట్యూబ్ అకాడమీ

- ట్విట్టర్‌లో చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో యూ ట్యూబ్ అకాడమి ఏర్పాటు చేయనున్నట్లు సిఎం చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. యూ ట్యూబ్ గ్లోబల్ సిఇఓ నీల్ మోహన్, గుగూల్ ఎపిఎసి హెడ్ సంజయ్ గుప్తాలతో వర్చువల్‌గా భేటీ అయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నైపుణ్యాభివృద్ధి, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లను ప్రోత్సహించేందుకు స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వారితో చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు.

ఎన్‌టిటిపిఎస్‌లో విద్యుదుత్పత్తికి అంతరాయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం (ఎన్‌టిటిపిఎస్)లో మంగళవారం ఉత్పత్తి నిలిచిపోయింది. యూనిట్లు ట్రిప్ కావడంతో ఐదు యూనిట్లలో విద్యుదుత్పాదన నిలిచిపోయింది. 1, 2, 4, 5, 6 యూనిట్లలో పూర్తి స్థాయిలో ఉత్పత్తి నిలిచిపోగా... 1150 మెగావాట్ల విద్యుదుత్పాదనకు అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం 3, 7, 8 యూనిట్లలో 892.5 మెగావాట్ల ఉత్పాదన జరుగుతోంది. అధికారులు పూర్తి స్థాయిలో ఉత్పాదన కొనసాగించేందుకు మరమ్మత్తులు చేపట్టారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సర్వీస్ వివాదంపై సాటి ఉద్యోగే ప్రశ్నించాలి

- హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి - అమరావతి

ఉద్యోగి సర్వీస్ వివాదంపై సాటి ఉద్యోగులు మాత్రమే కోర్టుల్లో సవాలు చేయాలని, సర్వీసులో లేని, సంబంధం లేని మూడో వ్యక్తి పిటిషన్లు దాఖలు చేయడానికి వీల్లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ మేరకు జస్టిస్ కె. మన్మథరావు ఇటీవల తీర్పు వెలువరించారు. శ్రీకృష్ణ గీత ఆశ్రమం ఇఓపై దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేశారు. కడప జిల్లా. ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణ గీత ఆశ్రమం కార్యనిర్వహణ అధికారి (ఇఓ) సి.శంకర బాలాజీని దేవాదాయ శాఖ ఇన్చార్జి అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించడాన్ని సవాల్ చేస్తూ ఎం.సురేష్ అనే వ్యక్తి పిటిషన్ వేశారు. దీనిని న్యాయమూర్తి కొట్టివేశారు. సర్వీసు ఉద్యోగాల్లో సహ ఉద్యోగే బాధితుడు అవుతారని తెలిపారు. ప్రభుత్వ సంస్థలో పని చేయని, ఆ సంస్థ పరిపాలన వ్యవహారాలతో సంబంధం లేని ఏ వ్యక్తి కూడా ఆ సంస్థ కార్యకలాపాలను, అధికారుల చర్యలను ప్రశ్నిస్తూ అధికరణ 226 కింద రిట్ పిటిషన్ వేసేందుకు వీల్లేదని పేర్కొంది. ఆ సంస్థ, ఆ అధికారి చర్యలపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే వేరే రూపంలో సవాలు చేయవచ్చని తెలిపింది.

'కృష్ణా' ఇరిగేషన్ ఎస్‌ఇపై చర్యలు

- సమీక్షలో సిఎం ఆదేశం
- ఇఎన్‌సికి సరెండర్ చేస్తున్నాం :మంత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కృష్ణా జిల్లా ఇరిగేషన్ ఇన్‌ఛార్జి ఎస్‌ఇ ప్రసాద్‌బాబుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. దీంతో ఆయన్ను ఇఎన్‌సికి సరెండర్ చేస్తున్నట్లు రాష్ట్ర జలవరనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సాగునీటి ప్రాజెక్టుల్లోకి చేరుతున్న వరద, పంటకాల్వల మరమ్మతులు, నీటి విడుదల లాంటి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం బ్యారేజి నుండి నీటి విడుదల అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈ విషయమై ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను కృష్ణా జిల్లా ఎస్‌ఇ సక్రమంగా అమలు చేయలేదని తేలినట్లు సమాచారం. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో ఈ తరహా నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అన్నట్లు తెలిసింది. సమీక్ష అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకాశం బ్యారేజి నుండి కష్ణా డెల్టాలోని కుడి,ఎడవ కాలువలకు పూర్తి స్థాయిలో నీటిని అందించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. కృష్ణా డెల్టాకు కష్ణానది పరివాహక ప్రాంతం,పట్టిసీమ,ప్రకాశం బ్యారేజిలో అందుబాటులో ఉన్ననీటిలో 16,500 క్యూసెక్కుల నీటిని కుడి,ఎడమ కాలువల ద్వారా సాగునీటికి సరఫరా చేయాలని ఆదేశించామని తెలిపారు.అదే సమయంలో పులిచింతల నుండి నీటిని డ్రా చేసుకోవాలని చెప్పినట్లు వివరించారు. ఈ ఆదేశాలను ఆయన పట్టించుకోలేదని అన్నారు. దీంతో ఆయన్ను ఇఎన్‌సికి సరెండర్ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఎకరాకు నీరు

ప్రస్తుతం ప్రాజెక్టుల అన్నింటిలో నీటి నిల్వలు సమృద్ధిగా వున్నాయని మంత్రి చెప్పారు. తెలిపారు. స్థిరీకరించిన ఆయకట్టులో ప్రతి ఎకరాకు నీరందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాల్వగట్లను, ఏటి గట్లను బలోపేతం చేస్తామని తెలిపారు. పోతిరెడ్డిపాడు నుండి రాయలసీమకు నీరిందించేందుకు చర్యలను చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వం సాగునీటి వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని కాలువలు,డ్రైన్లలో కనీసం పూడికతీత పనులు కూడా చేయలేక పోయిందని విమర్శించారు. లాకులు,షట్టర్లకు కనీసం గ్రీసు కూడా పూయక పోడవంతో దెబ్బతిని పనిచేయని స్థితికి చేరాయన్నారు. అదే విధంగా ఏటిగట్లు,కాలువగట్లు బలహీనమై గండ్లుపడే పరిస్థితులు నెలకొన్నాయని అలాంటివన్నీ గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వరదనీరు వధాగా సముద్రంలోనికి పోకుండా అన్ని రిజర్వాయర్లను పూర్తిగా నీటితో నింపాలని జలవనరుల శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వ్యవసాయం,అభివృద్ధి సంక్షేమం ఈప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అంశాలుగా వున్నాయని పేర్కొన్నారు.

ధర్నా చేస్తున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఒడి కార్యాలయాల వద్ద ఆందోళనలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, ఇఎస్‌ఐ లేనివారికి యాజమాన్యమే వైద్య సదుపాయం కల్పించాలని, నిర్వాసితులకు ఉపాధి దక్కేలా చూడాలని, ఎన్‌జెసిఎస్‌లో పెంచిన రూ.1200ను వెంటనే చెల్లించాలని, కార్మికులను తగ్గించాలన్న ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా జరిగాయి. స్టీల్ కోక్ ఓవెన్, ఆర్‌ఎంహెచ్‌పి, సిఆర్‌ఎంపి, సింటర్‌ప్లాంట్, టిపిపి, బిఎఫ్ డిపార్టుమెంటుల హెచ్‌ఒడి కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టారు. సంఘం గౌరవాధ్యక్షులు ఒవి.రావు మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అలసత్వం వహిస్తే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రెండు నుంచి నాలుగు నెలలుగా జీతాలు లేకపోయినా అందరూ పనిచేస్తున్నారని, వారి సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 13న చలో అడ్మిన్ బిల్డింగ్ కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, కెఎం.శ్రీనివాసరావు, చట్టి నర్సింగరావు, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు యు.రామస్వామి, శ్రీనివాసరాజు, శ్రీరామ చంద్రమూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ధర్నాల అనంతరం హెచ్‌ఒడిల కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

'అక్రమ లేఅవుట్ల' వివరాలపై ప్రత్యేక వెబ్‌సైట్

- మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అక్రమ లే అవుట్ల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా వెబ్‌సైట్ రూపొందించనున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. విజయవాడలో మంగళవారం సిఆర్‌డిఎ కార్యాలయంలో ఆ సంస్థ కమిషనరు కాటంనేని భాస్కర్, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథితో పాటు క్రెడాయ్, నరెడ్కో, బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ అక్రమ లేఅవుట్ల ప్రజలు మోసానికి గురౌతున్నారని, ఈ నేపథ్యంలో అనధికారిక లే అవుట్ల వివరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు చెప్పారు. అటువంటి లే అవుట్ల సర్వే నెంబర్లను పేపర్, టివిల ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఆయా సర్వే నెంబర్లు రిజిస్ట్రారు ఆఫీసుకు ఇవ్వడం ద్వారా ప్లాట్స్ కొనుగోలు చేయాలనుకునే వారికి పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. ఇందుకోసం రాబోయో మూడు నెలల్లో ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. సిఎం ఆదేశాలతో ఇప్పటికే నెల్లూరు కార్పొరేషన్‌లో స్పెషల్ డ్రైవ్ చేస్తున్నట్లు తెలిపారు. బిల్డర్లకు రెవెన్యూ పరమైన అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నందున టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని రిజిస్ట్రేషన్ విధానంతో అనుసంధానం చేస్తామన్నారు. కాగా అమరావతిలో దట్టంగా పేరకు పోయిన జంగిల్ క్లియరెన్స్ పనులు ఈ నెల 7నుంచి ప్రారంభించనున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు.

ఆర్-5 జోన్ వారికి సొంత ప్రాంతాల్లో ఇళ్లు

రాజధానిలోని ఆర్ -5 జోన్‌లో గతంలో స్థలాలు పొందిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సిఎంచంద్రబాబునాయుడు ఆదేశించారని మంత్రి నారాయణ తెలిపారు. ఎవరికైతే అక్కడ స్థలాలు కేటాయించారో వారిని గుర్తించి వారి వారి సొంత ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వడం లేదా టిడ్కో ఇళ్లు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. సిఆర్‌డిఎలో లబ్ధిదారులుంటే వారికి అక్కడే ఇళ్లు కేటాయిస్తామన్నారు. మరోవైపు టిడ్కో ఇళ్లకు మౌలిక వసతుల కల్పనపై మునిసిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని మంత్రి నారాయణ పేర్కొన్నారు. సిఆర్‌డిఎ పరిధిలోని ఇళ్లకు మౌలిక వసతుల కల్పన బాధ్యతను సిఆర్‌డిఎకు అప్పగించామని, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలో ఉండే టిడ్కో ఇళ్లకు వసతుల కల్పన బాధ్యతను ఆయా యుడిఎలకు అప్పగించినట్లు తెలిపారు.

రాజధానిలో పేదలు ఉండొద్దా : మేరుగ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని ప్రాంతంలో పేద ప్రజలకు ఇచ్చిన స్థలాలను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి మేరుగ నాగార్జున విమర్శించారు. మంగళవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన వైసిపి కేంద్ర కార్యాలయంలో మీడియా సెంటర్‌ను వైసిపి శాసనమండలి పక్షనాయకుడు లేళ్ల అప్పిరెడ్డి, నాయకులు శేషగిరిరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో పేదలు ఉండకూడదనే చంద్రబాబు ఆలోచన దుర్మార్గమైందన్నారు. పేద రైతుల నుంచి పొలాలు తీసుకుని అదే పేదలకు అక్కడ నివాసాలు వద్దనడం తగదన్నారు. చంద్రబాబు రెండు నెలల పాలన చూస్తేనే రాష్ట్రంలో ఏమి జరగబోతుందో అర్థమవుతోందని, దౌర్జన్య పాలనను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో దాడులు పెట్రేగిపోతున్నా.. చంద్రబాబు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాలపై దాడులు మంచిది కాదన్నారు. టిడిపి దౌర్జన్యాల నుండి పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటామని తెలిపారు.

ఈ ఏడాదీ నష్టాలే!

- ఆర్‌టిసి అంచనా
- సిఎంకు నివేదిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రజా రవాణా సంస్థ నష్టాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూడా ఆర్థిక కష్టాలు తప్పడం లేదని ఆ శాఖ అధికారులే చెబుతున్నారు. ఈ సంవత్సరం 1,618 కోట్లు నష్టం ఉంటుందని అంచనా వేశారు. ఆదాయం 8,104 కోట్లు ఉంటుందని అంచనా వేయగా, వ్యయం 9,723 కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. అంశాల వారీగా ఆదాయ వ్యయాలను ఇప్పటికే తయారు చేసిన సంస్థ అధికారులు ఆ వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సమర్పించినట్లు తెలిసింది. గత ఏడాది సవరించిన అంచనాల మేరకు 7,356 కోట్లు ఆదాయం సమకూరగా, ఈ ఏడాది అదనంగా 748 కోట్లు వస్తుందని అంచనా వేశారు. ఇందులో కీలకమైన టికెట్ల ద్వారా వచ్చే ఆదాయమే 6,666 కోట్లుగా ఉంటుందని, పలు బస్సు రాయితీల ద్వారా 708 కోట్లు వస్తుందని అంచనా వేశారు. ఇతర మార్గాల ద్వారా మరో 730 కోట్లు రావచ్చునని అందులో పేర్కొన్నారు.

సిబ్బందికోసం రూ. 4,681 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని లెక్కగట్టారు. అలాగే ఇంధనం కోసం 2,161 కోట్లు, వాహన పన్నుల కింద రూ. 442 కోట్లు, ఇప్పటివరకు చేసిన అప్పులపై చెల్లించాల్సిన వడ్డీ కింద రూ. 252 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని చెబుతున్న అధికారులు మిస్లీనియస్ (ఇతర ఖర్చులు) వ్యయం కింద 669 కోట్లు ఖర్చు చేయాలని పేర్కొన్నారు. అలాగే గత ఏడాది 10,887 సర్వీసులను నడుపగా, ఈ ఏడాది 11,124 సర్వీసులమను నడుపనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం మీద గతేడాది 145 కోట్ల కిలోమీటర్లు బస్సులు నడుపగా, ఈ ఏడాది 150 కోట్ల కిలోమీటర్లకుపైగా నడపనున్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు.

ఆదాయ, వ్యయాల్లో కొన్ని రంగాల్లో వివరాలు (రూ. కోట్లలో)

విభాగం	నిధులు
మొత్తం ఆదాయం	**8,104**
టికెట్ల ద్వారా6,666	
ఇతర ఆదాయం	731
మొత్తం వ్యయం	**9,723**
సిబ్బందిపై 4,681	
ఇంధన వ్యయం	2,161
వాహన పన్నులు	442
ఇతర వ్యయం	669
వడ్డీలకు	252
అద్దె బస్సులకు	1,094

ఉర్దూ విద్యాబోధనపై దృష్టి సారించండి

- రూటా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉర్దూ విద్యాబోధనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి సమస్యలకు పరిష్కారం చూపాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోషియేషన్(రూటా) డిమాండ్ చేసింది. ఈ మేరకు రూటా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు లయన్ ఇమామ్ బాషా, సయ్యద్ ఇక్బాల్‌లు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో మొదటి సారి 1997లో చంద్రబాబునాయుడు ఉర్దూ డిఎస్‌సి నిర్వహించి పోస్టులను భర్తీ చేశారని 2024లో కూడా ఉర్దూ డిఎస్‌సిని నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఉర్దూ మీడియం బోధన అభ్యసన కార్యక్రమాలు, పాఠ్యపుస్తకాల రూపకల్పన, శిక్షణా తరగతుల నిర్వహణ, అకడమిక్ క్యాలెండర్ రూపకల్పన, నిర్వాహణ, పరిశీలన తదితర అంశాలను పర్యవేక్షించేందుకు తక్షణం రాష్ట్ర ఉర్దూ అధికారి పోస్టును భర్తీ చేయాలని కోరారు. మోడల్ స్కూల్స్ , రెసిడెన్షియల్ స్కూల్స్, కేజీబివిలలో ఉర్దూను ఫస్ట్, సెకండ్ లాంగ్వేజ్‌గా ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రతి జిల్లాలో ప్రధానమంత్రి 15 పాయింట్ ఫార్ములాను అమలు చేయాలని కోరారు. ప్రతి జిల్లా కేంద్రంలో ముస్లిం మైనారిటీ బాలికల ఉచిత హాస్టల్‌ను ప్రారంభించాలని కోరారు. అలాగే రోష్నీ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు.అలాగే ఉర్దూ విద్యార్థులకు అనుగునంగా అంగన్‌వాడీలను ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి యూనివర్శిటీలో ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు..

అక్రమంగా తరలిస్తున్న బంగారం పట్టివేత

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న 4800 గ్రాముల బంగారాన్ని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద జరిగింది. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ దుబ్బాక శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముంబై, గోవా నుంచి అక్రమంగా బంగారాన్ని రవాణా చేస్తున్నారనే సమాచారంతో.. ఇఎస్ నవీన్ చంద్ర ఆదేశాలతో మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆరెంజ్ ట్రావెల్స్‌లో పూర్ణ చంద్రేష్ అనే వ్యక్తి 4800 గ్రాముల బంగారాన్ని రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్నామని, అయితే ఆ బంగారానికి సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లభ్యం కాలేదని సిఐ తెలిపారు. దాంతో ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో ఆబ్కారీ శాఖ సిబ్బంది నవ్య, జ్యోతి, అరుణ, జ్యోతి, సాయి, రాజేష్ పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో పీడియాట్రిక్ అనస్థీషియాలజిస్టుల సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పీడియాట్రిక్ అనస్థీషియాలజిస్టుల సమావేశం ఆగస్టు 10, 11 తేదీల్లో హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్నట్టు ఐఎపిఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రాజా నర్సింగ్ రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "ది పీడియాట్రిక్ అనస్థీషియా కనెక్ట్" థీమ్‌తో బేగంపేటలోని హెూటల్ ప్లాజాలో జరగబోయే ఈ సమావేశంలో దాదాపు 200 మంది నిపుణులు పాల్గొననున్నారు. దేశంలో 40 శాతం జనాభా పిల్లలే కావడంతో పీడియాట్రిక్ సర్జికల్, మత్తుమందు సేవలకు నానాటికి డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. పీడియాట్రిక్ అనస్థీషియా రంగంలో తాజా పోకడలు, పరిణామాలపై అప్‌డేట్ అవ్వడానికి ఈ సమాశాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఐఎపిఎ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.శైలజ మాట్లాడుతూ ప్రవేశం పొందేందుకు ముందుగానే రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

చంద్రశేఖర్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

- ఎపి ఎన్‌జిఓ నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల అంశాలపై మాజీ ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని ఎపి ఎన్‌జిఓ అసోసియేషన్ అధ్యక్షులు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి పురుషోత్తమనాయుడు తెలిపారు. మంగళవారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాం ఉద్యోగులకు చీకటి రోజులని తెలిపారు. ఉద్యమాలకు దిగిన నాయకులపై 4000 కేసులు పెట్టారని తెలిపారు. వాటిని ఎత్తేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పడం హర్షణీయమని పేర్కొన్నారు. 11 పిఆర్‌సిని గత ప్రభుత్వం రివర్స్ పిఆర్‌సిగా మార్చిందని వివరించారు. జిపిఎఫ్, ఎపిజిఎల్‌ఐ ఎకౌంట్ల నుండి గత ప్రభుత్వం డబ్బులు తీసుకుందని తెలిపారు. ఉద్యోగులకు రూ.21,900 కోట్లను బకాయి పెట్టారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై ప్రవీణ్ ప్రకాష్ వైఖరి అత్యంత హేయంగా ఉందని తెలిపారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద డ్యూటీలు వేసినప్పుడు చంద్రశేఖరరెడ్డి మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు.

'హంద్రీనీవా'పై నిర్లక్ష్యం

- పర్యవేక్షణ లోపంతో కాలువకు గండి
- తీవ్రంగా నష్టపోయిన రైతులు

వెల్దుర్తి మండలం మల్లేపల్లి వద్ద హంద్రీనీవా కాలువకు పడిన గండి

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి, వెల్దుర్తి

హంద్రీనీవా సుజల స్రవంతి అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోయారు. హైవే పనుల్లో భాగంగా కాలువను పూడ్చి వేసినా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై ప్రతిపక్షాలు తూర్పురాబట్టడంతో హుటాహుటిన వైపులైన్లు వేశారు. ఆ తర్వాత నీటిని విడుదల చేశారు. కాలువ పరిస్థితిపై పర్యవేక్షణ లేకపోవడంతో గండిపడింది. రాయలసీమలో కరువు నివారణ కోసం హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం చేపట్టారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలన్నది ప్రధాన లక్ష్యం. దీనిలో భాగంగా శ్రీశైలం జలాశయం ఎగువన కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల నుంచి 40 టిఎంసిల కృష్ణా వరద జలాలు ఎత్తిపోయాలి. ఫేజ్-1 కింద మల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కిలోమీటర్ల ప్రధాన కాలువ, 3,850 క్యూసెక్కులు ఎత్తిపోసేందుకు 8 పంపింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. కృష్ణా జలాలు కర్నూలు జిల్లా దాటి అనంతపురం జిల్లాకు చేరాలంటే కర్నూలు-గుంటూరు వయా నందికొట్కూరు-ఆత్మకూరు జాతీయ రహదారి (340సి), హైదరాబాద్-బెంగళూరు వయా కర్నూలు జాతీయ రహదారి దాటాల్సి ఉంది. కర్నూలు నగర శివారున బి.తాండ్రపాడు సర్కిల్ నుంచి ఆత్మకూరు వరకు 65 కిలోమీటర్ల మేర 340సి నేషనల్ హైవే నిర్మాణం పనులను దాదాపు రూ.1,200 కోట్లతో చేపట్టారు. నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా జూన్ ఆఖరులోగా హైవే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడంతోపాటు కాలువకు అడ్డుగా నిర్మించిన డైవర్షన్ రోడ్డు తొలగించాలని హంద్రీనీవా ఇంజనీర్లు స్పష్టమైన నిబంధనతో అనుమతి ఇచ్చారు. కృష్ణాకు వరదొచ్చి శ్రీశైలం గేట్లెత్తినా డైవర్షన్ రోడ్డును తొలగించలేదు. శ్రీశైలం జలాశయం 834 అడుగుల మట్టం దాటగానే మల్యాల నుంచి హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాలు ఎత్తిపోసే అవకాశం ఉంది. గత నెల 23న 837.80 అడుగులు దాటింది. డైవర్షన్ రోడ్డు అడ్డంకిగా ఉండడంతో ఆలస్యంగా ఈ నెల 1న నీటిని విడుదల చేశారు. కాలువలో పైపులు ఏర్పాటుతో సమస్య తలెత్తి కాసేపటికే నీటి విడుదలను ఆపేశారు. సమస్యను పరిష్కరించి మరుసటి రోజు నుంచి నీటిని విడుదల చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో వెల్దుర్తి మండల పరిధిలోని మల్లేపల్లి పంప్‌హౌస్‌కు సమీపంలో హంద్రీనీవా కాలువకు సోమవారం గండి పడింది. కాలువలకు మరమ్మతులు చేపట్టకుండా నీరు వదలడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు గండితో వెల్దుర్తి, కల్లూరు, కోడుమూరు మండలాల్లోని 250 ఎకరాల్లో పత్తి, కంది, మినుము పంటలు నీట మునిగాయి. భూమి కోతకు గురైంది. వెల్దుర్తి మండలం మల్లేపల్లిలో ఆదిలక్ష్మికి చెందిన రెండెకరాల్లో మొక్కజొన్న, కాంతన్న గౌడ్‌కు చెందిన ఆరు ఎకరాల్లో మొక్కజొన్న, నాలుగెకరాల్లో ప్రొద్దు తిరుగుడు పంటలు కొట్టుకుపోయాయి. మొత్తం మూడు మండలాల్లోని దాదాపు 250 ఎకరాల భూమి కోతకు గురైంది.

బాధితులను ఆదుకోవాలి : సిపిఎం

హంద్రీనీవా కాల్వ ఆయకట్టు రైతులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి, తదితరులు

బాధిత రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గండి పడిన హంద్రీనీవా కాల్వను, కోతకు గురైన పంట పొలాలను సిపిఎం ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఈ పంట పొలాలను స్వయంగా పరిశీలించాలని కోరారు. ప్రతిసారి కోతకు గురవుతున్నందున హంద్రీనీవా కాలువకు ఆ ప్రాంతంలో సిసి బండ్ వేయాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో గౌస్ దేశాయ్‌తోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు గురుశేఖర్, నగేష్ ఉన్నారు.

ఇక రాష్ట్ర రహదారులపైనా 'టోల్' బాదుడు?

- చర్చనీయాంశంగా మారిన సిఎం నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో రోడ్ల నిర్మాణంపై తీసుకున్న నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర రహదారులను కూడా ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖను ఆదేశించారు. దీంతో ఇప్పటిదాకా జాతీయ రహదారులకే పరిమితం అయిన టోల్‌బాదుడు రాష్ట్ర రహదారులకు వర్తిస్తుందని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో జాతీయ రహదారులు దాదాపు 8,500 కిలోమీటర్ల దాకా వుంటే రాష్ట్ర రహదారులు 12,653 కిలోమీటర్లుగా వున్నాయి. జిల్లా రహదారులు 32,725 కిలోమీటర్లుగా వున్నాయి. ఇప్పటికే జాతీయ రహదారులుగా వున్న 8,500 కిలోమీటర్లపై వాహన యజమానులు భరించలేని రీతిలో టోల్ చార్జీలు వసూలు చేస్తుండగా ఇకపై రాష్ట్ర రహదారులు 12,653 కిలోమీటర్లను కూడా పిపిపి పద్ధతిలో చేపట్టి టోల్ వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2016లోనే నిర్ణయించింది. రాష్ట్రంలో 31 రోడ్లను పిపిపి పద్ధతిలో చేపట్టాలని ప్రభుత్వం నాడు నిర్ణయించింది. ఇందులో వెయ్యి కిలోమీటర్ల పరిధిలోని 14 రోడ్లను యుద్ధ ప్రాతిపాదికన పిపిపి పద్ధతిలో చేపట్టేందుకు కార్యాచరణను రూపొందించాలని రాష్ట్ర ఆర్ అండ్ బి అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీ, ముఖ్యమైన పట్టణాలు కలిపే రోడ్లను, పర్యాటక ప్రాంతాలు వున్న రోడ్లను గుర్తించి యాక్షన్‌ప్లాన్ రూపొందించి పిపిపిలో చేపట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ఇప్పటికే త్రైమాసిక రోడ్ ట్యాక్స్ పెరిగి కట్టలేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర రహదారులకు కూడా టోల్ చార్జీలను వసూలు చేసేలా పిపిపి పద్ధతిలోకి పోవడం సరైంది కాదని ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరరావు ప్రజాశక్తితో అన్నారు. రాష్ట్ర రహదారులకు కూడా టోల్ చార్జీలు వసూలు చేస్తే అన్ని రకాలుగా రోడ్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు భాగస్వామ్యతో రాష్ట్ర రహదారులను నిర్మించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పిపిపి పద్ధతిలోకి తీసుకోవాలనుకున్న రోడ్ల జాబితా ఇదే

వ నెం	జిల్లాలు	రోడ్లరూట్	కిలోమీటర్లు
1	శ్రీకాకుళం, విజయనగరం	చిలకలపాలెం-రామభద్రాపురం - రాయగడ రోడ్	125
2	విజయనగరం, మన్యం	విజయనగరం- పాలకొండ రోడ్	72
3	అనకాపల్లి	భీమునిపట్నం -నర్సీపట్నం రోడ్	98
4	కోనసీమ, కాకినాడ	కాకినాడ - జొన్నాడ రోడ్	48
5	కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ	కాకినాడ - రాజమండ్రి కెనాల్ రోడ్	69
6	ఏలూరు	ఏలూరు- మేడిశెట్టివారిపాలెం రోడ్	68
7	ఏలూరు	ఏలూరు- జంగారెడ్డి గూడెం రోడ్	52
8	పశ్చిమ గోదావరి, ఏలూరు	నర్సాపూర్ - అశ్వరావుపేట రోడ్	117
9	గుంటూరు, బాపట్ల	గుంటూరు- బాపట్ల రోడ్	50
10	గుంటూరు	గుంటూరు- పర్చూర్ రోడ్	42
11	గుంటూరు	మంగళగిరి-తెనాలి- నార కోడూరు	40
12	ప్రకాశం	చినారికట్ల- ఒంగోలు రోడ్	61
13	తిరుపతి	శ్రీకాళహస్తి-తడ- సత్యవేడు రోడ్	48
14	అనంతపురం, కర్నూలు	గుత్తి, పత్తికొండ, ఆదోని, శిరుగుప్ప రోడ్	110
		మొత్తం	**1000 కి.మీ**

ఒంగోలు కలెక్టరేట్ వద్ద పెన్షనర్స్ ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, సీనియర్ సిటిజన్స్‌కు రైల్వే ప్రయాణాల్లో రాయితీలు పునరుద్ధరించాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఒంగోలు కలెక్టరేట్ ఎదుట ఇపిఎస్-95 పెన్షనర్లు ధర్నా చేపట్టారు. ఆల్ పెన్షనర్స్ , రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఇపిఎస్-95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ. 9,000లతో కలిపి డిఎ చెల్లించాలని డిమాండ్ చేశారు. హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ అందరికీ అమలు చేసి పెన్షన్ చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు రావాల్సిన పిఆర్‌సి, డిఎ, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ. రెండు లక్షల నుండి ఐదు లక్షల వరకు పెంచాలని కోరారు. సంఘ అధ్యక్షులు జి శేషయ్య అధ్యక్షతన జిల్లా గౌరవాధ్యక్షులు ఎవి పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రాంబాబు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డికి జైలు తప్పదు

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అవినీతి అక్రమాలకు జైలుశిక్ష తప్పదని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తిరుపతి అలిపిరి డిపోలో తిరుపతి - విజయవాడ మధ్య నడిచే నూతన హైర్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి ఫైల్ దగ్ధం కేసులో ఎవరు పాత్రధారులో అందరికీ తెలుసని అన్నారు. ఆధారాలు బయటపడితే పెద్దిరెడ్డి అరెస్టు కాక తప్పదని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నపుడు ఆయన చేసిన అన్యాయాలు, అక్రమాలు అంతా ఇంతా కాదని అన్నారు. పెద్దిరెడ్డి విషయంలో భయపడేవారెవరూ లేరని తెలిపారు. 'రెడ్‌బుక్'లో పేర్లను తొలగించారని ప్రచారం జరుగుతోందని, అందులో వాస్తవం లేదని, తమను ఇబ్బంది పెట్టినవారిని ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఐదేళ్ల జగన్ పాలనతో ఈ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు.

లడ్డు కాంప్లెక్స్‌ను పరిశీలించిన అదనపు ఇఒ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమలలోని లడ్డూ కాంప్లెక్స్‌ను మంగళవారం టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి పరిశీలించారు. పోటు పెష్కార్ శ్రీనివాసులుతో కలిసి లడ్డూ కాంప్లెక్స్‌ను సందర్శించి దర్శనం టికెట్లపై కౌంటర్లలో లడ్డూలు జారీ చేసే విధానాన్ని, అనంతరం లడ్డూ ప్రసాదాల తయారీకి సంబంధించిన ముడిసరుకుల నిల్వ ఉన్న ఉగ్రాణంను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో విజిఒ నంద కిషోర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరిస్తున్నా...

- వైసిపి శ్రేణులపై దాడులు ఆపాలి
- మాజీ సిఎం, వైసిపి అధినేత జగన్

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్, గన్నవరం

'ప్రభుత్వాన్ని మరోసారి హెచ్చరిస్తున్నాను. వైసిపి శ్రేణులపై దాడులు ఆపాలి' అని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహనరెడ్డి అన్నారు. ఆధిపత్యం చాటుకోవడం కోసం చంద్రబాబు దాడులకు పూనుకుంటున్నారని, ఇలాంటి ఘటనలతో ఆయన ఏం సాధిస్తారని ప్రశ్నించారు. ఈ నెల 3వ తేదీ రాత్రి టిడిపి శ్రేణుల దాడిలో తీవ్రంగా గాయపడి విజయవాడలోని సన్‌రైజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం నవాబుపేటకు వైసిపి సీనియర్ నాయకులు గింజుపల్లి శ్రీనివాసరావు, గాయపడిన మరో ఇద్దరు కార్యకర్తలు దేరంగుల గోపి, దేవిశెట్టి రామకృష్ణలను మంగళవారం ఆయన పరామర్శించారు. దాడి జరిగిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని, తానున్నానని, పార్టీ తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బాధితులకు అండగా ఉండాలని స్థానిక నేతలకు సూచించారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయని, పథకం ప్రకారమే దాడులు జరుగుతున్నాయని, గ్రామస్థాయి నుంచీ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని విమర్శించారు. వీటిపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు. దాడులపై గవర్నర్ దృష్టికి తీసుకెళతామని, అవసరమైతే హైకోర్టును, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపైనా, చివరకు చిన్నారులపైనా అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. పాఠశాలలను, ఆస్పత్రులను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. పెట్టుబడి సాయం చేయకుండా రైతులను, ఇచ్చిన హామీలను నిలుపుకోకుండా పిల్లలను, అక్కచెల్లెమ్మలను, తల్లులను... ఇలా అందరినీ మోసగిస్తున్నారని విమర్శించారు. కొత్త ప్రభుత్వంపై వ్యతిరేకతకు కాస్తో కూస్తో టైం పడుతుందని, కానీ చంద్రబాబుపై వ్యతిరేకత చాలా వేగంగా పెరిగిపోతోందని అన్నారు.

విజయవాడలోని సన్‌రైజ్ ఆస్పత్రిలో శ్రీనివాసరావును పరామర్శిస్తున్న వైఎస్.జగన్‌మోహనరెడ్డి

విమానాశ్రయం గేటు వద్ద బైఠాయించిన వెలంపల్లి

బెంగళూరు నుంచి గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన జగన్‌కు స్వాగతం పలికేందుకు వచ్చిన వైసిపి శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ కారుని లోనికి వెళ్లనీయలేదు. దీంతో, ఆయన గేటు వద్ద బైఠాయించి నిరసన తెలపడంతో అనుమతించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, వెలంపల్లి శ్రీనివాస్, ఎంఎల్‌సిలు లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, ఎండి.రుహుల్లా, మాజీ ఎంపి నందిగం సురేష్ తదితరులు జగన్‌కు స్వాగతం పలికారు.

2019-2023లో 45.8 శాతం పెరిగిన అత్యాచారాలు

- హడలెత్తించిన వైట్‌కాలర్, సైబర్ నేరాలు
- నేరతీవ్రత, వేధింపులూ విపరీతం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అత్యా చారాలు, నేరాలకు అంతే లేకుండా పోయింది. 2019-23 మధ్యకాలంలో కబ్జాలు, వైట్‌కాలర్ నేరాలు, వేధింపులు, సైబర్ నేరాలు ఇలా ఏ రూపంలో చూసినా.. నేరాల సంఖ్య, నేర తీవ్రత విపరీతంగా పెరిగాయి. గత ఐదేళ్లలో అయితే మహిళలపై అత్యాచారాలు 45.8 శాతం పెరిగాయి. మత్తు పదార్థాలు, గంజాయి వినియోగం హద్దుల్లేకుండా పోవడం నేరతీవ్రత పెరగడానికి కారమన్న విశ్లేషణలు ఆందోళన కల్గిస్తున్నాయి. దీనికి సంబంధించి రాష్ట్ర హోంశాఖ విడుదల చేసిన గత ఐదేళ్ల నేర నివేదికలో కీలక అంశాలు వెల్లడించింది. 2019-23 మధ్యకాలంలో మొత్తం నేరాల రేటు 46.8 శాతానికి పెరిగిందని పేర్కొంది. అంటే 2014-18 మధ్యకాలంలో 8,62,222 కేసులు నమోదైతే 2019-23 మధ్యకాలంలో 12,65,372 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. హత్యానేరాలు 3.6 శాతం పెరిగాయని, మహిళలపై అత్యాచారం కేసులు 45.8 శాతం పెరిగాయని పేర్కొన్నారు. 2014-28 మధ్యకాలంలో 4784 కేసులు నమోదైతే 2019-23 మధ్యకాలంలో 8209 అత్యాచారాలు పెరిగాయని అందులో ప్రస్తావించారు. కొట్టడం, బెదిరించడం వంటి కేసులైతే ఏకంగా 95.3 శాతం పెరిగాయి. ఇక సైబర్ నేరాలకు అంతే లేదు. ఏకంగా 175 శాతం నమోదయ్యాయి. మొత్తంగా రూ.940 కోట్లను సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. బ్యాంకుల్లో 140 కోట్లు ఫ్రీజ్ చేయగా, బాధితులకు రూ.8.26 కోట్లు మాత్రమే అందాయి. అనుమానితులకు సంబంధించి 14011 సిమ్‌కార్డులను బ్లాక్‌చేశారు. సైబర్ క్రైం నెంబరు 1930కి 75502 కాల్స్ రాగా, 2048 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. వైట్‌కాలర్ నేరాలు కూడా 33.8 శాతం నమోదయ్యాయి. గత ఐదేళ్లలో 34013 కేసులు వచ్చాయి. అందులోనూ చీటింగ్ కసులు 47.9 శాతం నమోదయ్యాయి. రోడ్డు ప్రమాదాలు, వేధింపులు, అక్రమ చొరబాటు కేసులు ఏకంగా 98.2 శాతం పెరిగాయి.

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
విజయవాడ మెయిన్ బ్రాంచ్
11-25-18, సింగరాజు వారి వీధి, కెటి రోడ్, విజయవాడ-520001. ఈ-మెయిల్ : bom396@mahabank.co.in ఫోన్ : 0866-2568727, 2569849

బంగారం వేలం - అమ్మకం ప్రకటన

కింద పేర్కొన్న వ్యక్తి రుణ ఖాతాలోని రుణాన్ని చెల్లించడంలో విఫలమయ్యారని ఇందుమూలంగా తెలియజేయడం జరిగింది. రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా వారికి పంపిన నోటీసులు బట్వాడా చేయకుండా బ్యాంకుకు తిరిగి వచ్చాయి. అందువల్ల వారు మొత్తం ఋణము మరియు ఇతర ఛార్జీలను చెల్లించవలసిందిగా మరియు **13.08.2024 (తేదీ)** లేదా అంతకు ముందు తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను తిరిగి చేజిక్కించుకోవాలని అభ్యర్థించబడినది, అలా చేయని పక్షంలో పేర్కొన్న సెక్యూరిటీలను రుణగ్రహీత యొక్క సొంత ఖర్చులతో బ్యాంక్ బహిరంగ వేలంలో బ్యాంకుల ప్రాంగణం వద్ద **తేది.14.08.2024 న ఉదయం 11.00 గంటలకు** లేదా బ్యాంక్ యొక్క సంపూర్ణ అభీష్టానుసారం తదుపరి నోటీసు లేకుండా ఏదైనా ఇతర అనుకూలమైన తేదీలో విక్రయిస్తుంది. బంగారు ఆభరణాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న పార్టీలు వేలంలో పాల్గొనవచ్చు.

వ. నెం.	లోన్ తేది	లోన్ ఖాతా నెంబరు	ఋణగ్రహీత పేరు & చిరునామా	వేలం యొక్క రిజర్వు ధర
1.	24.08.2024	60488308477	శ్రీ పావులూరి ప్రశాంతి, డి.నెం.మాపిల్-0122, రెయిన్ ట్రీ పార్క్, ద్వారక కృష్ణ టౌన్‌షిప్, నంబూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522508	రూ. 98,905/-
2.	24.08.2024	60488309447	శ్రీ పావులూరి ప్రశాంతి, డి.నెం.మాపిల్-0122, రెయిన్ ట్రీ పార్క్, ద్వారక కృష్ణ టౌన్‌షిప్, నంబూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522508	రూ. 12,41,225/-

తేది : 06-08-2024 సం/- బ్రాంచ్ మేనేజర్

UCO BANK
(Honours your trust)
UCO Bank, Zonal Office, 8-2-624, Ground Floor, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034 Email: zohybd.ol@ucobank.co.in , Contact: 040-23302611,23322596.

లాకర్ తెరుచు ప్రకటన

పలుమార్లు కోరినప్పటికీ దిగువ లాకర్ హోల్డర్స్ లాకర్ అద్దె బకాయిలను చెల్లించలేదు. వెంటనే లాకర్ అద్దె బకాయిలు చెల్లించుటకు మేము ఈ ఫైనల్ నోటీసు ను ఇస్తున్నాము మరియు సదరు బ్రాంచీ నుండి **31.08.2024** న లేదా ముందుగా న్యూ డ్యూస్ సర్టిఫికేట్‌ను సేకరించగలరు. లేదా బ్యాంకు సదరు లాకర్‌ను తెరుస్తుంది మరియు వెచ్చించిన వ్యయాలతోసహ బ్యాంకు బకాయిలను రికవరీచేయుటకు లాకర్ లో ఉన్న వస్తువులను వేలం వేస్తుంది. రికవరీచేయట ద్వారా బ్యాంకుకు గల బకాయిలకు ఏవేని సరిపోని విషయంలో, లాకర్ అద్దెదారుల నుండి వాటిని రికవరీచేయబడుతాయి.

క్ర. సం.	సోల్ ఐడి తో బ్రాంచి	లాకర్ నం.	లాకర్ హోల్డర్ పేరు	బకాయి మొత్తాలు (రూ)
1	VIJAYWADA 1 TOWN -0946	AA61	భీమార వరలక్ష్మి	Rs.8798

తేది: 07.08.2024
ప్రదేశం: విజయవాడ.
సం/- అధీకృత అధికారి, యూకో బ్యాంక్.

రాజ్‌భవన్‌లో మొక్కలు నాటిన గవర్నర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలోని రాజ్‌భవన్ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గవర్నరు పనస మొక్కను, ఆయన భార్య సంపంగి మొక్కను నాటారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ప్రాంగాణాల్లోనూ స్వచ్ఛ భారత్, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాల్సిందిగా వైస్ ఛాన్సెలర్లకు సూచనలు జారీ చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖను గవర్నరు ఆదేశించారు. వర్సిటీలతో పాటు అన్ని విద్యాసంస్థల్లోనూ సమగ్ర పారిశుధ్యం, పరిశుభ్రత కార్యక్రమాన్ని అమల్జేయాలని ఆదేశించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి పోషణ, సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, జియోట్యాగింగ్ చేసి, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం హరి జవహర్‌లాల్, రాజ్‌భవన్ అధికారులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్ ప్రాంగణంలో మొక్క నాటుతున్న గవర్నర్

వసతిగృహాల్లో సక్రమంగా మెనూ అమలు

- ఫుడ్ కమిషన్ ఛైర్మన్ ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాఠశాలలు, వసతిగృహాల్లో ఉండే విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం గుడ్లు, చిక్కీలు అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి అధికారులకు సూచించారు. విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలకు, బాలింతలకు ఉద్దేశించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను పటిష్టంగా అమల్జేయాలని సూచించారు.

చిన్నారిపై లైంగిక దాడి అమానుషం

- మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

అభంశుభం తెలియని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడటం అమానుషమని, సభ్యసమాజం తలదించుకునే సంఘటనకు పాల్పడిన దుండగుడికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ మండలం పల్లెర్లమూడి గ్రామంలో లైంగికదాడికి గురై విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నాలుగేళ్ల బాలికను, ఆమె కుటుంబ సభ్యులను ఆయన మంగళవారం పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ చిన్నారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఇటువంటి దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. సంఘటన గురించి తెలిసిన వెంటనే దుండగుడిని గుర్తించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించామన్నారు. నిందితుడిని రెంటచింతల సమీపంలో పోలీసులు అరెస్టు చేసినట్లు చెప్పారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారన్నారు. అనంతరం పాత ప్రభుత్వాస్పత్రిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. మంత్రి వెంట పాత ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వినయ్, ఆర్ఎంఒ డాక్టర్ శోభ, డాక్టర్ హిమబిందు ఉన్నారు.

'చుండూరు' బాధితులకు అందని న్యాయం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-చుండూరు (బాపట్ల జిల్లా)

చుండూరు కేసులో దళితులకు నేటికీ న్యాయం జరగలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు. సుప్రీం కోర్టులో 'చుండూరు' బాధితులకు న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. బాపట్ల జిల్లా చుండూరు గ్రామంలోని రక్తక్షేత్రం వద్ద దళిత మృతవీరుల సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మృతవీరుల సమాధుల వద్ద సిపిఎం, కెవిపిఎస్, దళిత, బహుజన ప్రజాసంఘాలు నాయకులు నివాళులర్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చుండూరు పోరాట కమిటీ అధ్యక్షులు జాలాది మోజెస్ అధ్యక్షతన జరిగిన సభలో డి.రమాదేవి మాట్లాడుతూ.. 33 సంవత్సరాల క్రితం పెత్తందారుల దాడిలో చనిపోయిన మతవీరులకు ఇప్పటికీ న్యాయం జరగపోవడానికి ప్రభుత్వాలు అనుసరిస్తోన్న విధానాలే కారణమని తెలిపారు. నిందితులకు కఠినమైన శిక్షలు పడకుండా పాలకపక్షాలు పెత్తందారులవైపు ఉండటం దుర్మార్గమన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వాలు చొరవ చూపి.. చుండూరు కేసులో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి సాధించుకున్న ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ చట్టాన్ని కాపాడు కోవడం కోసం దళిత, గిరిజన, వామపక్ష పార్టీలు ఐక్యంగా కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మేళం భాగ్యారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కష్ణమోహన్ పాల్గొన్నారు.

దళిత మృతవీరులకు నివాళులర్పిస్తున్న సిపిఎం, కెవిపిఎస్, దళిత, ప్రజా సంఘాల నాయకులు

మూడు సెషన్లలో రూ.22 లక్షల కోట్లు ఫట్

- సెన్సెక్స్ మరో 166 పాయింట్ల పతనం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడు సెషన్లలో పడిపోయాయి. మంగళవారం 166 పాయింట్లు నష్టపోయి 78,593కు తగ్గింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 63 పాయింట్లు కోల్పోయి 23,992 వద్ద ముగిసింది. నిఫ్టీ-50లో 29 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. కాగా గడిచిన మూడు సెషన్లలో బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ ఏకంగా రూ.22 లక్షల కోట్లు ఆవిరయ్యింది. దాదాపు నాలుగు శాతం మార్కెట్ విలువ పతనమయ్యింది. ఆగస్టు ఒకటో తేదీన సెన్సెక్స్ 82,129 పాయింట్ల జీవిత కాల గరిష్టాన్ని తాకింది. ఆ తర్వాత నుంచి మార్కెట్లు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

మంగళవారం ఇంట్రా ట్రేడింగ్‌లో 1000 పాయింట్ల గరిష్టానికి చేరినప్పటికీ.. ఆ తర్వాత బ్యాంకింగ్, టెలికం, ఆటో షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో తుదకు 166 పాయింట్ల నష్టాన్ని చవి చూసింది. బిఎస్ఇ మిడ్ క్యాప్ 0.71 శాతం, స్మాల్ క్యాప్ 0.57 శాతం చొప్పున తగ్గాయి.

అందుబాటులోకి పోకో 5జి

న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ పోకో తన కొత్త తన పోకో ఎం6 ప్లస్ 5జి ఫోన్ సహా బడ్స్ ఎక్స్1లను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. ఎం6 ప్లస్‌ను గ్లాస్‌డిజైన్, 108 ఎంపి కెమెరా వంటి ప్రధాన ఫీచర్లతో ఆవిష్కరించింది.

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra भारत सरकार का उद्यम

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
విజయవాడ మెయిన్ బ్రాంచ్
11-25-18, సింగరాజు వారి వీధి, కెటి రోడ్, విజయవాడ-520001. ఈ-మెయిల్ : bom396@mahabank.co.in ఫోన్ : 0866-2568727, 2569849

బంగారం వేలం - అమ్మకం ప్రకటన

కింద పేర్కొన్న వ్యక్తి రుణ ఖాతాలోని రుణాన్ని చెల్లించడంలో విఫలమయ్యారని ఇందుమూలంగా తెలియజేయడం జరిగింది. రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా వారికి పంపిన నోటీసులు బట్వాడా చేయకుండా బ్యాంకుకు తిరిగి వచ్చాయి. అందువల్ల వారు మొత్తం ఋణము మరియు ఇతర ఛార్జీలను చెల్లించవలసిందిగా మరియు **13.08.2024 (తేదీ)** లేదా అంతకు ముందు తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను తిరిగి చేజిక్కించుకోవాలని అభ్యర్థించబడినది, అలా చేయని పక్షంలో పేర్కొన్న సెక్యూరిటీలను రుణగ్రహీత యొక్క సొంత ఖర్చులతో బ్యాంక్ బహిరంగ వేలంలో బ్యాంకుల ప్రాంగణం వద్ద **తేది.14.08.2024 న ఉదయం 11.00 గంటలకు** లేదా బ్యాంక్ యొక్క సంపూర్ణ అభీష్టానుసారం తదుపరి నోటీసు లేకుండా ఏదైనా ఇతర అనుకూలమైన తేదీలో విక్రయిస్తుంది. బంగారు ఆభరణాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న పార్టీలు వేలంలో పాల్గొనవచ్చు.

వ. నెం.	లోన్ తేది	లోన్ ఖాతా నెంబరు	ఋణగ్రహీత పేరు & చిరునామా	వేలం యొక్క రిజర్వు ధర
1.	24.08.2024	60488291712	శ్రీ పావులూరి సుబ్రహ్మణ్యస్వామి, డి.నెం.మాపిల్-0122, రెయిన్ ట్రీ పార్క్, ద్వారక కృష్ణ టౌన్‌షిప్, నంబూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522508	రూ. 9,43,200/-
2.	24.08.2024	60488311638	శ్రీ పావులూరి సుబ్రహ్మణ్యస్వామి, డి.నెం.మాపిల్-0122, రెయిన్ ట్రీ పార్క్, ద్వారక కృష్ణ టౌన్‌షిప్, నంబూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522508	రూ. 14,73,750/-
3.	24.08.2024	60488310805	శ్రీ పావులూరి సుబ్రహ్మణ్యస్వామి, డి.నెం.మాపిల్-0122, రెయిన్ ట్రీ పార్క్, ద్వారక కృష్ణ టౌన్‌షిప్, నంబూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522508	రూ. 14,08,250/-
4.	24.08.2024	60488311093	శ్రీ పావులూరి సుబ్రహ్మణ్యస్వామి, డి.నెం.మాపిల్-0122, రెయిన్ ట్రీ పార్క్, ద్వారక కృష్ణ టౌన్‌షిప్, నంబూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522508	రూ. 5,04,350/-
5.	24.08.2024	60488310384	శ్రీ పావులూరి సుబ్రహ్మణ్యస్వామి, డి.నెం.మాపిల్-0122, రెయిన్ ట్రీ పార్క్, ద్వారక కృష్ణ టౌన్‌షిప్, నంబూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522508	రూ. 10,15,250/-
6.	24.08.2024	60488310168	శ్రీ పావులూరి సుబ్రహ్మణ్యస్వామి, డి.నెం.మాపిల్-0122, రెయిన్ ట్రీ పార్క్, ద్వారక కృష్ణ టౌన్‌షిప్, నంబూరు, గుంటూరు జిల్లా, ఆం.ప్ర.-522508	రూ. 1,14,625/-

తేది : 06-08-2024 సం/- బ్రాంచ్ మేనేజర్

CHANGE OF NAME

I, **Kajol jain Ashok (old name)**Resident of D.No.1-1-151/6,Flat No.210,A-Block,Kousthubha Nivas, Kummaripalem,Vijayawada,NTR District,Andhra Pradesh-520012.My Name has been changed to **Kajol Solanki (New name)** .Hereafter my name is known as **Kajol Solanki.**

CHANGE OF NAME

I, **Gokavarapu Suresh Babu (old name)** Resident of D.No.28/42, Circle Peta,Near Muthyalamma Temple,Machilipa -tnam,Krishna District,Andhra Pradesh-522412. My Name has been changed to **Gokavarapu Rama Naga Venkata Suresh Babu (New name)** .Hereafter my name is known as **Gokavarapu Rama Naga Venkata Suresh Babu.**

CHANGE OF NAME

I, **Medisetti Durga Malleswara Rao (old name)** Resident of D.No.21-17-10,Near Ramadevi School,Madhura Nagar,Vijayawada,NTR District,Andhra Pradesh-520011.My Name has been changed to **Medisetty Durga Malleswara Rao (New name)** .Hereafter my name is known as **Medisetty Durga Malleswara Rao**

రేషన్ వాహనాలపై డోలాయనం!

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో గత ప్రభుత్వం రేషన్ సరుకుల పంపిణీకి ప్రవేశపెట్టిన వాహనాలను కొనసాగించాలా? లేక తొలగించాలా? అనే అంశంపై ప్రభుత్వ వర్గాల్లో తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఈ వాహనాల వల్ల ఎటువంటి ఉపయోగమూ లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకోలేని వారికి మాత్రమే వాహనాల ద్వారా ఇళ్ల వద్దకు రేషన్ అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం కలెక్టర్ల సమావేశంలో పేర్కొన్నారు. దీంతో, తమ వాహనాలను కొనసాగిస్తారా? లేదా? అని ఎండియు వాహనాదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రం మొత్తమ్మీద 29,796 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో మూడు, నాలుగు దుకాణాలకు కలిపి ఒక వాహనాన్ని గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలో 9,261 వాహనాలు రేషన్‌ను ఇళ్ల వద్ద అందిస్తున్నాయి. రాష్ట్రంలో 1,48,43,671 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టం ద్వారా 90,21,931 కార్డులకు సబ్సిడీ బియ్యం అందిస్తుండగా, 58,21,740 కార్డులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. గత ప్రభుత్వం ఇంటి వద్దకు రేషన్ అందించేందుకు 9,261 వాహనాలను సమకూర్చింది. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన నిరుద్యోగ యువకులకు ఈ వాహనాల నిర్వహణా బాధ్యతలు అప్పగించింది. వీరికి బ్యాంకుల ద్వారా రూ.20 లక్షలు ఇప్పించింది. ఒక్కో వాహనానికి నెలకు రూ.21 వేలు చెల్లిస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రంలో 29,796 మంది డీలర్లు కొనసాగుతున్నారు. వారికి కిలో బియ్యానికి రూపాయి కమీషన్ అందజేస్తోంది. ఒకే పథకానికి రెండు ఖర్చులపై ప్రభుత్వం తర్జనభర్జన పడుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత రేషన్ సరఫరాపై జరిగిన సమీక్షలో వాహనాల వల్ల ఒరిగిదేమీ లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ అభిప్రాయపడ్డారు. ఇంటికి నేరుగా రేషన్ సరుకులకు ఇవ్వడం లేదని, ఒక కూడలి ప్రదేశంలో వాహనం ఏర్పాటు చేసి వినియోగదారులను అక్కడికి రప్పించి సరుకులు ఇవ్వడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదని తాజాగా అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. రేషన్ సరుకుల పంపిణీలో డీలర్లను కొనసాగిస్తూ పది శాతం వాహనాలను కొనసాగిస్తే సరిపోతుందని సూచించినట్లు తెలిసింది. తాము బ్యాంకులకు రూ.20 లక్షల వరకు చెల్లించాల్సి ఉందని, గత నాలుగేళ్లుగా తాము రేషన్ వాహనం ద్వారా ఉపాధి పొందుతున్నామని, తమను తొలగిస్తే ఉపాధి ఎలా? వాహనాల బకాయిలు ఎవరు చెల్లిస్తారని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. డీలర్లలో ఎక్కువమంది అధికార పార్టీకి చెందిన వారే ఉన్నారని, వాహనదారులు వైసిపికి చెందిన వారు ఎక్కువగా ఉండడం వల్ల వారిని మార్చాలన్న ఒత్తిడి ప్రభుత్వంపై అధికంగా ఉందని ప్రచారం జరుగుతోంది.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate
గుడివాడ బ్రాంచ్
గుడివాడ, కృష్ణా జిల్లా-521301.
ఫోన్: 8331015683

ఋణగ్రహీత యొక్క చట్టబద్ధ వారసులైన వారికి డిమాండ్ నోటీసు

బ్యాంకు వారు సర్ఫేసి చట్టంను వినియోగించి ఋణగ్రహీత అయిన **అడపా వెంకట రమణ (లేటు)**పై చర్యలు చేపట్టడమైనది.

సెక్యూరిటీ ఆస్తి వివరములు: కృష్ణా జిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రీ, గుడివాడ మున్సిపాలిటీ, 18వ వార్డు, పెదఎరుకపాడు, ఆర్.ఎస్.నెం 29/1, డోర్ నెం. 18/267-C1 నందు గల మొత్తం ఎ. 0-10 సెంట్లు లేదా 484 చ॥గ॥ లేదా 405.14 చ॥మీ॥ స్థలంలోనున్న పెంకుటిల్లు. హద్దులు: ఉత్తరం: పందెళ్ల శివయ్య స్థలం, దక్షిణం: కమ్మిలి రమా స్థలం, తూర్పు: బజారు, పడమర: అడపా వెంకట రమణ స్థలం. డాక్యుమెంట్ ప్రకారం తేది.22.12.1997 (డాక్యుమెంట్ నెం. 210/1997). **టైటిల్ హోల్డర్: శ్రీ అడపా వెంకట రమణ.**

బ్యాంకుకు తెలిసిన చట్టపరమైన వారసులు: (1) శ్రీమతి అడపా శ్రీదేవి, భర్త: వెంకట రమణ (లేటు) (2) శ్రీమతి అడపా శ్రావణి, తండ్రి:వెంకట రమణ (లేటు)

ఎవరికైనా పైన తెలిపిన ఆస్తిపై ఏదైనా ఆక్షేపణలు లేదా క్లెయిమ్‌లు ఉన్నట్లయితే అతను/ఆమె ఈ ప్రచురణ తేది నుండి 15 రోజులలోపు ఈ బ్రాంచ్‌నందు సంప్రదించవచ్చు **లేని పక్షంలో** బ్యాంకు వారు సర్ఫేసి చట్టంను వినియోగించి బ్రాంచ్‌కు తెలిసిన ఋణగ్రహీత చట్టపర వారసులపై చర్యలు ప్రారంభించబడతాయి.

తేది: 07.08.2024,
ప్రదేశం: గుడివాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

బయోడీగ్రేడబుల్ సంస్థలతో డిఆర్‌డిఒ జట్టు

హైదరాబాద్ : ప్రపంచ వ్యాప్తంగా బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ప్రోత్సాహానికి 40కి పైగా పరిశ్రమలతో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) భాగస్వామ్యం కుదర్చుకుంది. డిఆర్‌డిఒలోని కె వీరబ్రహ్మం, ఆయన బృందం పిబిఎటి ఆధారిత బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్‌ను అభివృద్ధి చేసి, పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలతో మార్కెట్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు ఆ సంస్థ తెలిపింది. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గించే దిశగా ఇది కీలక ముందడుగని పేర్కొంది. పెట్రోలియం ఉత్పత్తులు లేదా మొక్కల నూనెల నుంచి సేకరిం చిన బయోడీగ్రేడబుల్ పాలిమర్ అయిన పిబిఎటిని ఉపయోగించి బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ ఉత్పత్తులను అభివృద్ధి చేసినట్లు తెలిపింది.

50 వేల ఉద్యోగులకు 10 రోజుల సెలవు

- కిరణ్ జెమ్స్ సంస్థ నిర్ణయం

అహ్మదాబాద్ : ప్రముఖ వజ్రాల తయారీ సంస్థ కిరణ్ జెమ్స్ ఒకేసారి తన 50,000 మంది ఉద్యోగులకు 10 రోజులు సెలవులు ప్రకటించింది. ప్రపంచంలోనే అతిపెద్ద వజ్రాల తయారీ సంస్థగా గుర్తింపు పొందిన ఈ సంస్థ ఆగస్టు 17-27వ తేది వరకు సెలవులను ఇచ్చింది. గుజరాత్‌లోని సూరత్ కేంద్రంగా కిరణ్ జెమ్స్ పని చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వజ్రాలకు పడిపోతున్న డిమాండ్ నేపథ్యంలో ఉత్పత్తిని నియంత్రించేందుకు ఈ నిర్ణయం తీసుకుందని తెలుస్తోంది.

11 వరకు అమెజాన్ గ్రేట్ ఫ్రీడం ఫెస్టివల్

న్యూఢిల్లీ : అమెజాన్ గ్రేట్ ఫ్రీడం ఫెస్టివల్‌ను ఆగస్టు 6 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ సేల్‌లో డిస్కౌంట్‌తో పాటు అదనంగా బ్యాంకు, కూపన్ ఆఫర్లతో స్మార్ట్ ఫోన్ల ధరలను భారీగా తగ్గించినట్లు పేర్కొంది. ఎస్‌బిఐ క్రెడిట్ కార్డు యూజర్లు, ఎస్‌బిఐ ఖాతాదారులు ఇఎంఐ పేమెంట్స్ ద్వారా స్మార్ట్‌ఫోన్ బుక్ చేసుకుంటే 10 శాతం డిస్కౌంట్‌ను అందిస్తున్నట్లు తెలిపింది.

Canara Bank
A Government of India Undertaking
सिंडिकेट Syndicate

ఎఆర్ఎమ్ శాఖ: గ్రౌండ్ ఫ్లోర్, సర్కిల్ ఆఫీస్ భవనం, ఎమ్‌సిహెచ్ నం.:10-3-163 మరియు 10-3-163/ఎ, ప్లాట్ నం.85 సర్వే నం.625, రైల్ నిలయం ప్రక్కన, సికింద్రాబాద్-500 026.
PH : 040- 27725260, 27725259.
E MAIL : cb2752@canarabank.com

విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6) ఆర్/డబ్ల్యు రూల్ 9(1) నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు.

రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన క్రింద వివరించిన స్థిరాస్తులు స్పెషలైజ్డ్ మిడ్ కార్పొరేట్ శాఖ, సోమాజిగూడ శాఖ యొక్క అధీకృత అధికారి ద్వారా లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలియజేయడమైనది. తర్వాత ఫాలో అప్ కొరకు కెనరా బ్యాంక్ యొక్క ఎఆర్ఎమ్ శాఖకు బదిలీ చేయబడింది. "ఏది ఎక్కడ ఉన్నదో " "అది అక్కడ అలాగే " మరియు "ఏమైనా ఉన్నది" ప్రాతిపదికన 28.08.2024న విక్రయించబడును. రికవరీ కొరకు రూ.1,27,97,554.71/- (30.06.2024 నాటికి కాంట్రాక్టువల్ బకాయిలు) ప్లస్ వర్తించని వడ్డీ మరియు స్పెషలైజ్డ్ మిడ్ కార్పొరేట్ శాఖ, సోమాజిగూడ, కెనరా బ్యాంక్‌కు బకాయి ఉన్న మెసెర్స్.జయంత్ కన్‌స్ట్రక్షన్స్, దీని పాట్నర్లు మరియు హామీదారులు (ఎ) శ్రీ. అట్లూరి చంద్ర శేఖర్, తండ్రి. శ్రీ.ఎ.భగత్ సింగ్ మరియు (బి) శ్రీమతి. అట్లూరి శ్రవంతి, భర్త. ఎ.చంద్ర శేఖర్ ద్వారా ప్రాతినిధ్యం.

వేలం తేది మరియు సమయం : 28.08.2024, ఉ.11.30 గం. నుండి మ.12.30 గం.
(అమ్మకం ముగింపు వరకు ప్రతి 10 నిమిషముల వ్యవధి అపరిమిత పొడిగింపుతో)
ధరావత్తు డిపాజిట్ మొత్తం 23.08.2024, సా.5.00 గం. వరకు లేదా అంతకు ముందు డిపాజిట్ చేయబడుతుంది.

స్థిరాస్తుల పూర్తి వివరణ మరియు వివరాలు

లాట్ నం.1 : ఆంధ్రప్రదేశ్-521286, కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, పొట్టిపాడు గ్రామం మరియు గ్రామ పంచాయితీ వద్ద గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధిలో శ్రీమతి. శ్రవంతి పేరు మీద ఉన్న సేల్ డీడ్ నం.7244/2011 ప్రకారం ఆర్.ఎస్.నం.371లో స్థలం మొత్తం ఆ భాగం మరియు పార్సిల్ మరియు భవనంతో డో.నం.3-71 కొలత 484 చ.గ.లు. (399 చ.గ.లు.) మరియు హద్దులు : ఉత్తరం : పి. వెంకట సుబ్బయ్య మనవడు శ్రీ కిషోర్ కు చెందిన సైట్, దక్షిణం : పంచాయతీ రోడ్డు, తూర్పు : పి. వెంకట సుబ్బయ్య మనవడు కిషోర్‌కు చెందిన స్థలం, పడమర : పంచాయతీ రోడ్డు.

రిజర్వు ధర : రూ.91,14,000/-, ఇఎమ్‌డి : రూ.9,11,400/-, బిడ్ మల్టిపుల్స్ : రూ.1,00,000/

లాట్ నం.2 : ఆంధ్రప్రదేశ్-521401, కృష్ణాజిల్లా, గంపలగూడెం మండలం, నెమలి గ్రామం మరియు గ్రామ పంచాయితీ వద్ద తిరువూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికార పరిధిలో శ్రవంతి పేరు మీద ఉన్న సేల్ డీడ్ నం.3983/2010 ప్రకారం ఆర్.ఎస్.నం.95/3లో స్థలం మొత్తం ఆ భాగం మరియు పార్సిల్ మరియు భవనం కొలత 2904 చ.గ.లు. తో విడదీసిన ఇంటి నం.3-149/ఎ మరియు హద్దులు : ఉత్తరం : శ్రీ బెల్లం నాగేశ్వరరావుకు చెందిన ఓపెన్ స్థలం, దక్షిణం : గరిడెపల్లి రామకృష్ణకు చ ఎందిన స్థలం, తూర్పు : గ్రామ పంచాయితీ రోడ్డు, పడమర : పామర్తి వెంకట్‌కు చెందిన ఓపెన్ స్థలం.

రిజర్వు ధర : రూ.1,12,16,000/-, ఇఎమ్‌డి : రూ.11,21,600/-, బిడ్ మల్టిపుల్స్ : రూ.1,00,000/

బ్యాంకుకు తెలిసినంత వరకు ఎటువంటి తెలియని భారాలు లేవు. ఏది ఏమైనప్పటికీ బిడ్డర్లు బిడ్‌ను సమర్పించే ముందు ఆస్తిపై ప్రభావం చూపే భారాలు మరియు ఆస్తుల శీర్షిక గురించి వారి స్వంత స్వతంత్ర విచారణలు తెలియజేయవలసి ఉంటుంది మరియు ఇ-వేలంలో పాల్గొనవలసి ఉంటుంది.
అమ్మకం యొక్క వివరణాత్మక షరతులు మరియు నిబంధనల కొరకు దయచేసి కెనరా బ్యాంక్ లో కేటాయించిన "ఇ-వేలం" అందించిన లింక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లేదా అధీకృత అధికారి, ఎఆర్ఎమ్ శాఖ, కెనరా బ్యాంక్, ఫోన్ నం.: 040-27725283/ 27725285 ఏవైనా పని దినములలో కార్యాలయ సమయంలో సంప్రదించగలరు.

తేది: 06.08.2024 ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి కెనరా బ్యాంక్

సంపాదకీయం

ప్రజాగ్రహ జ్వాల!

పచ్చి నిరంకుశ, అవినీతికర పాలనకు బంగ్లాదేశ్ విద్యార్థులు చరమగీతం పాడారు. జనం ఎగురవేసిన తిరుగుబాటు బావుటా షేక్ హసీనా ప్రభుత్వాన్ని చరిత్ర కాలగర్భంలో కలిపేసింది. ఒకప్పుడు లక్షలాది మంది ఆహ్వానంతో దేశంలో అడుగుపెట్టిన హసీనా... ప్రజాగ్రహానికి జడిసి... హడావిడిగా దేశం విడిచిపెట్టాల్సి రావడం స్వయంకృతం. సర్కారు అణచివేతలో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం విచారకరం.

పదహారేళ్లపాటు హసీనా ఏలుబడి అప్రతిహతంగా సాగింది. బంగ్లాదేశ్ జాతిపిత ముజిబుర్ రెహ్మాన్ కుమార్తెగా, తండ్రిని, తన కుటుంబాన్ని సైనిక కుట్రలో కోల్పోయిన ఆమె పచ్చి నిరంకుశవాదిగా తయారవడం విచిత్రం. బంగ్లా విమోచన సందర్భంలో పాక్ అనుకూల మత ఛాందస వాదులు, వారి మద్దతుదారుల మారణకాండలో దాదాపు 30 లక్షల మంది పౌరులు బలయ్యారు. 1975లో అప్పటి అధ్యక్షుడైన తన తండ్రి హత్య సమయంలో సమయంలో జర్మనీలో ఉండి, ప్రాణాలతో బయటపడిన హసీనా ఆరేళ్లపాటు భారతదేశంలో ఆశ్రయం పొందారు. 1981లో సొంత గడ్డపై అడుగుపెట్టిన ఆమె అనేక ఆటుపోట్లతోపాటు 19 సార్లు హత్యాయత్నాలను సైతం ఎదుర్కొన్నారు. ఆమె హయాంలో దక్షిణాసియాలో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. మనదేశానికి మిత్రదేశంగా ఉంటూ... పలు అభివృద్ధి పనులు చేపట్టారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) చీఫ్ ఖలీదా జియా అధికారంలో ఉన్నప్పుడు ఈశాన్య భారతంలో పాక్ అనుకూల గ్రూపులు విధ్వంసానికి పాల్పడగా, హసీనా వాటికి అడ్డుకట్ట వేశారు. మిలట్రీ నియంత, ఖలీదా జియా భర్త జియావుర్ రహమాన్ ఏలుబడిలో ముస్లిం ఛాందసవాదులను ప్రోత్సహించి, ఇస్లామిక్ దేశంగా మార్చేందుకు ప్రయత్నించగా, అందుకు భిన్నంగా హసీనా లౌకిక మార్గాన్ని ఎంచుకుని భారత్, చైనాలతో సత్సంబంధాలు కొనసాగించారు.

నయా ఉదారవాద విధానాల అమలుకు పోటీపడటంతో అవినీతి పెచ్చుమీరింది. బ్యాంకులకు ఎగవేతలు, కుంభకోణాలు సర్వసాధారణమయ్యాయి. ఆర్థిక అసమానతలు ఆకాశాన్నంటాయి. నిరుద్యోగం తీవ్రరూపం దాల్చింది. ద్రవ్యోల్బణం పదిశాతానికి ఎగబాకింది. సామాన్యుల జీవితాలు అతలాకుతలమయ్యాయి. భావ ప్రకటనా స్వేచ్ఛను, మీడియాను, ప్రతిపక్షాలను అణచివేశారు. సర్వాధికారాలు గుప్పెట్లో పెట్టుకుని, కోర్టులు సైతం నోరుమెదపకుండా చేశారు. పోలీసులు, సైన్యంలో అవినీతి పెచ్చుమీరింది. కిందిస్థాయిలో ఎన్నికలు నిర్వహించకుండా ప్రజాస్వామ్యం గొంతునొక్కారు. ఈ పరిణామాలు ప్రజల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతను పెంచాయి. ఈ ఏడాది జనవరిలో జరిగిన ఎన్నికల్లో వరుసగా నాలుగోసారి అవామీలీగ్ అధికార పగ్గాలు చేపట్టినా పోలింగ్ 41 శాతమే నమోదైంది. ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరించాయి. పది వేల మంది వరకూ ప్రతిపక్ష కార్యకర్తలు జైలులోకి నెట్టబడ్డారు. ప్రతిపక్ష నేత ఖలీదా జియా 17 ఏళ్లుగా గృహ నిర్బంధంలోనే ఉన్నారు. బంగ్లా విమోచన యోధుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో యూనివర్శిటీల్లో గత జూన్‌లో ఆందోళనలు పెల్లుబికాయి. సుప్రీంకోర్టు దాన్ని ఐదు శాతానికి, మొత్తంగా రిజర్వేషన్లను ఏడుశాతానికి పరిమితం చేసినా... నిరసన జ్వాలలు చల్లారలేదు. చిట్టచివరికి... హసీనా రాజీనామా చేసి 45 నిమిషాల్లో దేశం విడిచి వెళ్లిపోవాలని, జాతినుద్దేశించి టివిలో మాట్లాడకూడదని సైన్యం ఆదేశించినట్లు వార్తలొచ్చాయి. ప్రస్తుతం భారత్‌లో ఉన్న ఆమె భవిష్యత్ కార్యాచరణ ఏమిటన్నది తెలియాల్సి ఉంది. భారత విదేశాంగ మంత్రి చెప్పినట్లు బంగ్లాదేశ్‌లో ఉన్న పది వేల మంది భారత విద్యార్థుల భద్రత దృష్ట్యా అక్కడి సైన్యంతో సంప్రదింపులు జరిపి, భద్రంగా తీసుకురావడం కేంద్రం కర్తవ్యం. ప్రజల మనోభావాలను గుర్తించకుండా నిరంకుశంగా వ్యవహరిస్తే.. ఎంతటి నేతలకైనా... ఎలాంటి దురవస్థ పడుతుందనే దానికి గత రెండు రోజుల బంగ్లాదేశ్ పరిణామాలు నిదర్శనం. శాంతి, సుస్థిరతలను పునరుద్ధరించేందుకు ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు కృషి చేయాలి. బాహ్య శక్తుల మద్దతుతో లబ్ధిపొందాలనుకునే మితవాద, ఛాందసవాద శక్తులకు అడుకట్ట వేయాలి. దేశం మళ్లీ సైన్యం గుప్పెట్లోకి పోకుండా ప్రజాతంత్ర శక్తులు తగు జాగ్రత్త వహించాలి. ఇది ఆ దేశ భవిష్యత్... అక్కడి ప్రజలతోపాటు పొరుగున ఉన్న మన దేశానికి కూడా ప్రధానమే.

మహనీయుల మాట

నిన్న పోయింది.
రేపు ఇంకా రాలేదు.
మనకు ఈ రోజు మాత్రమే ఉంది.
ప్రారంభిద్దాం.
- మదర్ థెరిస్సా

విశ్లేషణ

వికసిత భారత్ ఇలాగా...!

వి. రాంభూపాల్

స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు పూర్తవుతున్న 2047 నాటికి మన దేశాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరుస్తామని మోడీ ప్రభుత్వం చెబుతున్నది. అభివృద్ధి చెందిన దేశం అంటే ఏమిటి? ఒక దేశంలోని ప్రజల సగటు తలసరి ఆదాయాన్ని బట్టి అభివృద్ధి చెందిన, చెందుతున్న లేదా వెనుకబడిన దేశాలుగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు వర్ణిస్తున్నాయి. ప్రస్తుత లెక్కల ప్రకారం సగటు తలసరి ఆదాయం 13,845 డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ ఆదాయం వుంటే ఆ దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా గుర్తిస్తున్నాయి. మన దేశ ప్రస్తుత సగటు తలసరి ఆదాయం 2,500 డాలర్లని ఏప్రిల్ 2024లో ఐఎంఎఫ్ విడుదల చేసిన ఆర్థిక నివేదికలో తెలిపింది. 77 ఏళ్ళ స్వాతంత్ర్యం తర్వాత మన ఈ తలసరి ఆదాయం (2,500 డాలర్లు)....2047 నాటికి...అంటే రానున్న 23 ఏళ్ళలో అభివృద్ధి చెందిన దేశంగా గుర్తించడానికి ఇప్పటి లెక్కల ప్రకారం అదనంగా 11,345 డాలర్ల తలసరి ఆదాయానికి చేరుకోవాలి. సాధ్యమా? ఈ సగటు లెక్కలే భలే జిమ్మిక్కుగా వుంటాయి. 15 వేల కోట్లు ఖర్చు పెట్టి పెళ్ళి చేసిన అంబానీ ఆస్తి, కనీసం పెళ్ళి చేసే ఆర్థిక స్థోమత లేక దాతలు ఇచ్చే ఉచిత తాళి కోసం ఎదురుచూసే పేదవాని ఆస్తి కలిపి సగటు ఆదాయాన్ని లెక్కిస్తారు. అంబానీ ఆస్తి నుండి పేదవానికి నయా పైసా రాకపోయినా, సగటు లెక్కల్లో మాత్రం ఇద్దరి ఆస్తి సమానమౌతుంది.

దేశం అభివృద్ధి చెందాలంటే మొదట పెట్టుబడులు పెరగాలి. తయారీ, సేవలు, ఎగుమతుల తయారీకి ప్రాధాన్యత ఇవ్వాలి. కొత్త సాంకేతిక పరిజ్ఞానం కోసం పరిశోధనలు చేయాలి. దేశ యువతకు ఉపాధి చూపించడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ దిశగా మన ఆర్థిక విధానాలు వుండాలి. అప్పుడే తయారీ రంగంతో పాటు, మౌళిక రంగాలు అంటే రైల్వే, రోడ్లు, గృహ వసతి, నీటి పారుదల, విద్యుత్, విద్య, వైద్య రంగాలతో పాటు వ్యవసాయాభివృద్ధికి పెట్టుబడులు పెరుగుతాయి. ఈ రంగాల్లో పెట్టుబడి ఖర్చులు ఎక్కువ, ఆదాయం తక్కువ. కావున, ప్రైవేట్ పెట్టుబడులు రావు. ప్రభుత్వమే ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలి. కానీ 1991 తర్వాత అమలవుతున్న ప్రపంచీకరణ విధానాలు సరిగ్గా ఇందుకు విరుద్ధంగా వున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, రైల్వే, రోడ్లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, టెలికం, విద్య, వైద్య రంగాలతో పాటు కీలకమైన వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే విధానాలను గత 25 సంవత్సరాలుగా పాలకులు అమలు చేస్తున్నారు. దీని ఫలితంగా దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. మోడీ పాలనలోని గత ఆరు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.82 లక్షల కోట్లకు పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరానికి మరో రూ.12 లక్షల కోట్లు అప్పు చేయడానికి బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టారు.

> **వేగంగా దిగజారిపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవలసి వుంది. కానీ, నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీకి గత సంవత్సరం కంటే రూ.24,894 కోట్లు, ఆహార సబ్సిడీకి రూ.7,082 కోట్లు తగ్గించేశారు. రానున్న రోజుల్లో ఎరువులు, పురుగు మందుల ధరలు మరింతగా పెరుగుతాయి. పంటల పెట్టుబడి సహాయం పెంచకుండా, కనీస మద్దతు ధర, ఉచిత బీమా అమలు చేయకుండా వ్యవసాయ సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. ఆహార సబ్సిడీ తగ్గించడంతో పేదలకు అందుతున్న రేషన్ సరుకుల కోటా తగ్గిపోతుంది. ఆకలి కేకలు పెరుగుతాయి. వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు కొంత ఊరటనిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో కేటాయించిన రూ.86 వేల కోట్లలో, ఇప్పటికే చేసిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.41,500 కోట్లు పోను, మిగిలింది కేవలం రూ. 44,500 కోట్లు. ఇంత తక్కువ డబ్బుతో కోట్ల మంది పేదలకు పనులు ఎలా కల్పిస్తారు?**

వ్యవసాయం పట్ల నిర్లక్ష్యం

మన దేశం అభివృద్ధి సాధించాలంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలని 2024 ఫిబ్రవరి 27న మహారాష్ట్రలోని యవత్మాల్‌లో మోడీ ఉపన్యసించారు. దేశ జనాభాలో 60 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2018-19 నాడు 7.8 శాతం అభివృద్ధితో వున్న వ్యవసాయ రంగం 2024 మార్చి నాటికి 0.6 శాతానికి పడిపోయింది. వేగంగా దిగజారిపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవలసి వుంది.

కానీ, నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీకి గత సంవత్సరం కంటే రూ.24,894 కోట్లు, ఆహార సబ్సిడీకి రూ.7,082 కోట్లు తగ్గించేశారు. రానున్న రోజుల్లో ఎరువులు, పురుగు మందుల ధరలు మరింతగా పెరుగుతాయి. పంటల పెట్టుబడి సహాయం పెంచకుండా, కనీస మద్దతు ధర, ఉచిత బీమా అమలు చేయకుండా వ్యవసాయ సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. ఆహార సబ్సిడీ తగ్గించడంతో పేదలకు అందుతున్న రేషన్ సరుకుల కోటా తగ్గిపోతుంది. ఆకలి కేకలు పెరుగుతాయి. వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు కొంత ఊరటనిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో కేటాయించిన రూ.86 వేల కోట్లలో, ఇప్పటికే చేసిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.41,500 కోట్లు పోను, మిగిలింది కేవలం రూ. 44,500 కోట్లు. ఇంత తక్కువ డబ్బుతో కోట్ల మంది పేదలకు పనులు ఎలా కల్పిస్తారు?

పెరిగిన నిరుద్యోగం

ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ మరియు ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ కలిసి విడుదల చేసిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్టు-2024 ప్రకారం దేశంలో నిరుద్యోగ తీవ్రత చాలా ఎక్కువగా వుంది. దేశంలో పని చేయగలిగిన శ్రామికుల సంఖ్య 2011లో 61 శాతం వుంటే 2021 నాటికి 64 శాతానికి పెరిగిందని, అయితే ఈ శ్రామిక జనాభాలో 2022 నాటికి కేవలం 37 శాతం మందికి మాత్రమే పనులు దొరికాయని ఈ నివేదిక తెలిపింది. యువతకు ఉపాధి కల్పించడం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్ అని ఈ నివేదిక హెచ్చరించింది. లేబర్ పార్టిసిపేషన్ రేట్ (ఎల్‌పిఆర్) తాజా రిపోర్టు ప్రకారం నిరుద్యోగ రేటు 2008లో 5.41 శాతం వుండగా, 2014లో 5.44, 2020లో 8.00, 2024 జూన్ నాటికి 9.2 శాతానికి చేరుకుంది. ఈ పరిస్థితి నిరుద్యోగ రెడ్‌జోన్ లాంటిది. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ (ఎ.ఐ) ప్రభావంతో నిరుద్యోగం మరింత తీవ్రం కానుంది. ఐటి సేవల రంగాలలో తక్కువ నైపుణ్యం అవసరమైన 6,40,000 ఉద్యోగాలు పోతాయని "భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం" అనే నివేదికలో ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఓ) ఇటీవల తెలిపింది.

విద్య- విజ్ఞానం

2047 నాటికి దేశం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే విద్యారంగం కీలకమని, దేశ స్థూల జాతీయ ఆదాయంలో కనీసం 6 శాతం నిధులు విద్యకు కేటాయించాలని ప్రముఖ విద్యావేత్త గోవిందస్వామి విశ్వనాథన్ కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ మీడియాకు చెప్పారు. ప్రజల తలసరి ఆదాయం పెరుగుదలలో విద్యాభివృద్ధి కీలకమని ఆయన దక్షిణాది రాష్ట్రాలను ఉదాహరణగా చూపారు. అత్యధిక అక్షరాస్యత వున్న కేరళ తలసరి ఆదాయం దేశంలో మొదటి స్థానంలో వుందని, ఈ తర్వాత స్థానాల్లో తమిళనాడు, తెలంగాణ వున్నాయన్నారు. బీహార్ తలసరి ఆదాయం అతి తక్కువగా వుండడానికి అక్షరాస్యత కూడా ముఖ్య కారణమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన ఈ 76 ఏళ్ళలో ఎన్నడూ 3 శాతానికి మించి విద్యకు నిధులు కేటాయించలేదు. 2017 బడ్జెట్‌లో ఉన్నత విద్యకు జిడిపి లో 1.47 శాతం కేటాయిస్తే, ఈ సంవత్సరం కేవలం 0.99 శాతం మాత్రమే కేటాయించారు. పాఠశాల విద్యకు మరింతగా తగ్గించారు. ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి రంగాలన్నింటికి నిధుల కేటాయింపులు తగ్గిపోయాయి. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా నినాదాలను రాజకీయ ప్రచారం కోసం వాడుకుంటున్నారు. మన పొరుగు దేశాలు పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ అండ్ డి) కోసం తమ బడ్జెట్‌లో కేటాయింపులు పెంచుతూ విజ్ఞానాభివృద్ధికి బాటలు వేసుకుంటూ, అంతర్జాతీయ వ్యాపారాన్ని విస్తరించు కుంటున్నాయి.

ఈసురోమని దేశముంటే...

ఈసురోమని దేశముంటే దేశమేగతి బాగుపడునోయ్ అని గురజాడ అప్పారావు ఏనాడో ప్రశ్నించారు. దేశంలో కోట్ల మంది కనీస తిండికి నోచుకోవడం లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ జులై నెలలో విడుదల చేసిన 'ది స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ది వరల్డ్' నివేదిక-2022లో 56.5 శాతం మంది భారతీయులు 'ఆరోగ్యకరమైన ఆహారాన్ని' పొందలేదని చెప్పింది. దేశంలోని 79 కోట్ల మంది ప్రజలు ఆహారం కోసం రోజుకు రూ. 350 ఖర్చు చేసే స్థితిలో లేరని పేర్కొంది. ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ సేవలు కుదించుకుపోయాయి. పేద, మధ్య తరగతి వారికి వచ్చే అరకొర ఆదాయం నుండి విద్య, వైద్యానికి చేసే ఖర్చులు పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. మన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి మనిషి ఆహారం కోసం సగటున నెలకు రూ.1750 ఖర్చు చేస్తుండగా, పట్టణ ప్రాంతాల్లో రూ.2,529.67 ఖర్చు చేస్తున్నారని జూన్‌లో విడుదలైన ద హౌస్‌హోల్డ్ కన్జమ్షన్ ఎక్స్‌పెండీచర్ సర్వే (హెచ్‌సిఇఎస్) తెలిపింది. ఆహారం కాని ఇతర వాటి కోసం (విద్య, వైద్యం, బాడుగలు, ప్రయాణాల లాంటి) గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.2,023.14, పట్టణ ప్రాంతాల్లో రూ.3,929.03 ఖర్చు అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆహారం కోసం గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,149.18 పైసలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2,616.66 పైసలు, ఆహారం కాని వాటి కోసం గ్రామీణ ప్రాంతాల్లో రూ.2,721.11, పట్టణ ప్రాంతాల్లో రూ.4,165.09 ఖర్చు చేస్తున్నారు. ఆదాయం మూరెడు, ఖర్చు బారెడు అన్నట్లుగా ప్రజల పరిస్థితి మారింది. ఈ అంతరాన్ని పరిష్కరించకుండా మోడీ చెబుతున్నట్లు 2047 నాటికి దేశం సమగ్రాభివృద్ధి ఎలా సాధిస్తుంది?

తీవ్రమైన ఆర్థిక అసమానతలు

దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయి. కుబేరులు అపర కుబేరులు అవుతున్నారు. దేశంలోని సంపదలో 40.1 శాతం సంపద కేవలం ఒక్క శాతంగా వున్న కోటీశ్వరుల దగ్గర వుండగా, అట్టడుగున వున్న 50 శాతం ప్రజల దగ్గర 0.17 శాతం సంపద మాత్రమే ఉంటే దేశం ఏ గతిన బాగుపడుతుంది? సగటు భారతీయుడి కంటే కోటీశ్వరుల సంపద సుమారు 17 వేల రెట్లు ఎక్కువ. దేశంలో బ్రిటీష్ పాలన 1922 నాటి కంటే 2023 నాటికి భారీగా పెరిగాయని నోబుల్ బహుమతి గ్రహీత పికెట్టీ లాంటి మేధావులు విశ్లేషిస్తున్నారు. ఈ ఆర్థిక అంతరాలను తగ్గించడానికి సంపన్నుల మీద పన్నులు వేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. లక్ష్యం ఘనమైంది అయితేనే సరిపోదు, లక్ష్యాన్ని సాధించడానికి ఎంచుకునే మార్గాలు కీలకం. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరడమంటే కేవలం కొద్ది మందిగా వున్న కోటీశ్వరులు శత కోటీశ్వరులుగా మారడం కాదు. కోటాను కోట్ల దేశ ప్రజలు సమగ్రంగా అభివృద్ధి చెందడం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

జనవాక్యం

గాజాలో మారణహోమం!

పాలస్తీనాను అక్రమించుకోవడానికి ఇజ్రాయిల్ మారణ హోమానికి ఉపక్రమించింది. అమెరికా, అమెరికాలోని ఆయుధ సామ్రాజ్యం దానికి సాయం చేస్తోంది. గాజాలో విధ్వంసం సృష్టిస్తోంది. ప్రజల ప్రాణాలను ముఖ్యంగా మహిళల, పసిపిల్లల ప్రాణాలను పొట్టన పెట్టుకుంటోంది. వేల మంది బలి అయ్యారు. మారణహోమం ఆపాలనీ లేకపోతే ప్రతీకారం తీర్చుకుంటాం అంటూ హమాస్ బరిలోకి దిగింది. దీనికి మళ్లీ ప్రతీకారం తీర్చుకుంటామని ఇజ్రాయిల్ అంటోంది. ఐక్యరాజ్య సమితి తీసుకునే చర్యలను అమెరికా మోకాలు అడ్డ పెట్టి ఆపుతోంది. ప్రపంచం అంతా వేడుక చూస్తోంది. మానవత్వం కలిగిన ప్రజలు యుద్ధాలు వద్దని శాంతియుత నిరసన ర్యాలీలు చేస్తున్నారు. ప్రపంచంలోని వివిధ దేశాలలో విద్యార్థులు సంఘీభావం తెలుపుతున్నారు. అయినా యుద్ధ వాతా వరణం తగ్గట్లేదు. రోజురోజుకూ రాజేస్తున్నారు. ఒక దేశాన్ని ఇంకొక దేశం ఆక్రమించడం, దానికి ప్రపంచంలోనే అగ్రదేశం సాయం చేయడం, ప్రజలెందరు వ్యతిరేకించినా పాలకులు చలించకపోవడం, సామ్రాజ్య కాంక్ష పెరగడం తగదు. అమెరికా తన ఆయుధ వ్యాపారం వృద్ధి చేసుకునే పనిలో ప్రపంచంలో యుద్ధ వాతావరణం నిరంతరం రగులుస్తూ ఉంది. మరి శాంతికి మార్గం ఏదీ? కిం కర్తవ్యం!! ఒకటే దారి ఈ చర్యలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడమే. నిరంతరాయంగా ప్రతిఘటించడమే.

- తవ్వా సురేష్

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

సందర్భం

చేనేతను ధ్వంసం చేస్తున్న బిజెపి విధానాలు

స్వాతంత్ర్యోద్యమ సమ యంలో 1905 ఆగస్టు 7న కలకత్తాలో మొదలైన స్వదేశీ ఉద్యమంలో భాగంగా విదేశీ వస్త్ర బహిష్కరణ, స్వదేశీ వస్త్ర నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ఆ రోజును గుర్తు చేసుకుంటూ జాతీయ చేనేత దినోత్సవం జరుపుకుంటున్నాం. కానీ నాటి బ్రిటిష్ పాలకులు అనుసరించిన చేనేత వ్యతిరేక విధానాలతో పాటు స్వతంత్ర భారతదేశ పరిపాలనలో చేనేతను ధ్వంసం చేసేలా రూపొందిన విధానాలను నేడు బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్నది. చేనేత రంగానికి కేటాయించిన పదకొండు రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయకుండా, చేనేత రిజర్వేషన్ చట్టంలోని ఉత్పత్తులకు మిల్లుల్లో అవకాశాలను కల్పిస్తున్నది. నేడు పోచంపల్లి టై అండ్ డై ఇక్కత్ చీరలు, కరీంనగర్ చెద్దర్లు, వరంగల్ దర్రీస్, సిద్దిపేట గొల్లభామ చీరలు, గద్వాల కాటన్ చీరలు, ధర్మవరం, కంచి, బెనారస్, మంగళగిరి, వెంకటగిరి మొదలగు వస్త్రాలు మిల్లులపై తయారవుతున్న వాటిని... నిలువరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదు. దీనిలో చేనేతను ధ్వంసం చేసే ఆలోచనలే కనబడుతున్నాయి తప్ప మరొకటి కాదు. చేనేత కార్మికులు పోరాడి సాధించుకున్న జాతీయ చేనేత బోర్డును రద్దు చేయడం, మహాత్మా గాంధీ బునకర్ బీమా యోజన, ఐసిఐసిఐ లాంబార్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమ్, చేనేత కార్మికుల హౌస్ కం వర్క్ షెడ్ లాంటి పథకాలను బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత రద్దు చేయడంతో పాటు, చేనేత ముడి సరుకులైన యారన్‌పై ఐదు శాతం, రంగులు, రసాయనాలపై 5-12 శాతం జీఎస్టీని విధించి చేనేత కార్మికులకు ముడి సరుకులు అందుబాటులోకి లేకుండా చేసింది. అదే విధంగా చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీని విధించి చేనేత వస్త్ర వినియోగ దారులకు, చేనేత వస్త్రాలు అందుబాటులో లేకుండా దూరం చేసి చేనేత వస్త్ర మార్కెట్‌ను దెబ్బ తీసింది. చేనేత పరిశ్రమ, కార్మికుల ఉపాధి సంక్షేమం, అభివృద్ధి కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మిల్లు రంగాలకే పెద్ద ఎత్తున నిధులను కేటాయించి చేనేత విధ్వంస విధానాలను రూపొందించి అమలు చేస్తున్నది.

నాటి బ్రిటీష్ పాలకులపై...మిల్లు వస్త్రాలకు వ్యతిరేకంగా గ్రామీణ ఉపాధి రంగమైన చేనేతను కాపాడుకోవాలని ఆగస్టు 7న మహత్తర ఉద్యమ ప్రస్థానం ప్రారంభమైన రోజు. నేడు స్వతంత్ర భారతదేశ పాలకులు అనుసరిస్తున్న చేనేత వ్యతిరేక విధానాలపై నాటి ఉద్యమ స్ఫూర్తిని తలుచుకొని ఉద్యమించాల్సిన అవసరం చేనేత కార్మికులపై, అభిమానులపై ఉన్నది. ఆ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించడమే నిజమైన చేనేత దినోత్సవం.

- కూరపాటి రమేష్,
సెల్ : 9490098048

కవిత్వం



మాయలోడు

ఆకలికి అర క్షణం ఆగలేడు
తిండి తిననిదే పూటైనా గడపలేడు
కొంప లేకుండా కుదురుగా వుండలేడు
బట్ట కట్టకుండా దిశ మొలతో తిరగలేడు
వాహనం ఎక్కనిదే గమ్యం చేరలేడు
క్షణం ఆగితే చాలు కరెంటు...
చిర్రు బుర్రు చేష్టలతో శివాలెత్తిపోతాడు
కాసు పడనిదే పెదవి విప్పడు ...
కాలు కదపడు. రోగం వస్తే... వైద్యం కోసం
అర్రులు చాస్తూ... ! పరుగులు తీస్తాడు
మైకు లేనిదే గొంతు విప్పలేడు...
ప్రవచన పురాణం చెప్పలేడు
సెల్ఫోన్, టివి, సినిమాలకు
వుండలేడు వాడు దూరం
ఫ్యాను, ఎసీ, గ్యాస్టౌ, కంప్యూటర్,
ఏదైనాగానీ...! ఆధునిక సౌకర్యం...
వద్దనడు, వదులుకోడు
ఇహ లోకపు సుఖాలను తిరస్కరించడు
భౌతిక వాంఛలను విసర్జించడు
అయినాగానీ....! వాడు...!
జగమంతా మాయంటాడు
బతుకు భ్రమ నమ్మమంటాడు
కంటికి కనిపించేదంతా మిథ్యంటాడు
తెలుసుకుంటేనే ముక్తి మోక్షం
పొమ్మంటాడు.
వాడు మామూలోడు కాదు...
మాయ మాటలతో...
మతులు పోగొట్టు మాయలోడు.

- వి.రాజగోపాల్,
విజయనగరం, సెల్ : 9666016636

సమస్య

ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్‌సి

కిల్లో సురేంద్ర

ప్రపంచ వ్యాప్తంగా 40 దేశాల్లో సుమారు 40 కోట్ల మంది ఆదివాసీ ప్రజలు జీవిస్తున్నారు. ఆదివాసీల హక్కులను గుర్తించాలని 1994 ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఐక్యరాజ్యాసమితి డిక్లరేషన్ ఆమోదించింది. స్వాతంత్ర్యం వచ్చి నేటికి 77 ఏళ్ళు పూర్తయినప్పటికీ ఆదివాసీల హక్కులు, చట్టాలు, సంస్కృతిని గుర్తించడానికి ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయి. ప్రపంచ నలుమూలలా వున్న ఆదివాసీలు తమ హక్కులు కాపాడబడాలని ఆగస్టు 9 తేదీన ఘనంగా ఆదివాసీ దినోత్సవం జరుపుకుంటారు. భారతదేశంలో 700 ఆదివాసీ, 75 ఆదిమ గిరిజన (పివిటిజి) తెగలతో సుమారు 10 కోట్ల మందికి పైగా జీవిస్తున్నారు. కేంద్రంలో మూడోసారి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఆదివాసీల రాజ్యాంగ హక్కులను గుర్తించడానికి నిరాకరిస్తున్నది.

జి.ఓ నెం.3కి చట్టబద్ధత

అడవులపై ఆదివాసీలు సాధించిన హక్కులను తొలగించి ప్రైవేట్ బడా కార్పొరేట్ కంపెనీలకు ప్రవేశం కల్పిస్తున్నది. ఆదివాసీల విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతులు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నది. ఆగస్టు 9వ తేదీన రాష్ట్ర నలుమూలల్లో ఆదివాసీ హక్కుల దినోత్సవం ఘనంగా జరపాలి. అంతేగాక ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి. జి.ఓ నెంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన టిడిపి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మొదటి రోజునే రాష్ట్రంలో 16,347 పోస్టుల మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు తొలి సంతకం చేశారు. జనరల్ డిఎస్‌సి వలన ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం జరగదు. ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ద్వారానే ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలంటే జి.ఓ నెం.3కి చట్టబద్ధత కల్పించాలి. అందువల్ల ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9న జి.ఓ 3కు చట్టబద్ధత కల్పించి, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు ప్రకటన చేయాలి.

> **రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన టిడిపి నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మొదటి రోజునే రాష్ట్రంలో 16,347 పోస్టుల మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు తొలి సంతకం చేశారు. జనరల్ డిఎస్‌సి వలన ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం జరగదు. ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ద్వారానే ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలంటే జి.ఓ నెం.3కి చట్టబద్ధత కల్పించాలి. అందువల్ల ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9న జి.ఓ 3కు చట్టబద్ధత కల్పించి, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు ప్రకటన చేయాలి.**

కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం

మోడీ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఇటీవలి కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసింది. జనాభా ప్రాతిపదిక మీద 8.3 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.5 శాతం తక్కువ నిధులు కేటాయించారు. ఈసారి బడ్జెట్‌లో రూ.13,000 వేల కోట్లు కేటాయించామని, గతం కన్నా 4.31 శాతం అధికమని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. గత బడ్జెట్ కేటాయింపులు చూసినప్పుడు రూ.12,461 కోట్లు కేటాయించగా ఖర్చు చేసింది కేవలం రూ.7,605 కోట్లు మాత్రమే. 39 శాతం నిధులు ఖర్చు చేయలేదు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో గిరిజన యూనివర్సిటీకి పైసా కేటాయించలేదు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు రెండున్నర లక్షల మంది తమని అదుకుంటారని ఎదురు చూసినా అతీగతీ లేదు. మరోవైపు గోదావరి వరదల్లో వందలాది గ్రామాలు మునిగిపోవడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ హక్కులు, చట్టాల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుని ఆదివాసీ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

/ వ్యాసకర్త ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్: 94906 30715 /

హసీనాకు అన్ని విధాలా సాయం

- విదేశీ జోక్యాన్ని కొట్టి పారేయలేం
- అఖిలపక్ష సమావేశంలో జైశంకర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

షేక్ హసీనాకు భారత్ అన్ని విధాలా సాయం చేసిందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తెలిపారు. అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో పరిస్థితి క్షీణిస్తే అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాల వెనుక విదేశీ శక్తుల జోక్యాన్ని కొట్టిపారేయలేమని చెప్పారు. సోమవారం సాయంత్రం హసీనా ఢిల్లీకి చేరుకున్నట్లు చెప్పారు. బంగ్లాదేశ్‌లో హింస, అస్థిరతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. 2024 జనవరి ఎన్నికల నాటి నుంచి బంగ్లాదేశ్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. జులై నెలలో హింస పెరిగిందని, చర్చలు నిర్వహించాలని కోరినట్లు ఆయన వెల్లడించారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. ప్రజలు మాత్రం ఆందోళనలు విరమించలేదన్నారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వంతో సంబంధం ఉన్న నేతలకు చెందిన ఆస్తులను ఆందోళనకారులు నాశనం చేసినట్లు పేర్కొన్నారు. మైనార్టీలకు చెందిన వ్యాపారాలు, ఆలయాలపై కూడా దాడి జరిగినట్లు మంత్రి జైశంకర్ తెలిపారు. ఆగస్టు 5న కర్ఫ్యూ ఉన్నా.. జనం రోడ్లపైకి వచ్చారన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ఎస్ జైశంకర్, జెపి నడ్డా, కిరణ్ రిజిజు, ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, డిఎంకె ఎంపి టిఆర్ బాలు, ఎన్‌సిపి ఎంపి సుప్రియా సులే, ఆర్‌జెడి ఎంపి మీసా భారతి, జెడియు ఎంపి, కేంద్ర మంత్రి లలన్ సింగ్, ఎస్‌పి ఎంపి రామ్‌గోపాల్ యాదవ్, టిఎంసి ఎంపిలు సుదీప్ బందోపాధ్యాయ, డెరెక్ ఒబ్రెయిన్, శివసేన ఎంపి అరవింద్ సావంత్, బిజెడి సస్మిత్

పాత్ర, టిడిపి ఎంపి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఢాకాలో ప్రభుత్వ మార్పిడితో దౌత్యపరమైన పరిణామాలను ఎదుర్కోవడంలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యూహం ఏమైనా ఉందా..? అని కేంద్ర ప్రభుత్వాన్ని రాహుల్ ప్రశ్నించారు. దీనికి కేంద్ర మంత్రి బదులిస్తూ.. ప్రభుత్వ ఏర్పాటుకు జరుగుతున్న పరిస్థితుల్ని కేంద్రం నిశితంగా విశ్లేషిస్తున్నట్లు చెప్పారు. తద్వారా తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. షేక్ హసీనాను గద్దె దింపేందుకు గత కొన్ని వారాలుగా ఢాకాలో జరిగిన నాటకీయ పరిణామాల వెనుక విదేశీ శక్తుల కుట్ర, ప్రత్యేకించి పాకిస్థాన్ ప్రమేయం ఏమైనా ఉందా..? అని రాహుల్ ప్రశ్నించారు. దీనిపై ఇప్పుడే ఒక అంచనాకు రావడం తొందరపాటు అవుతుందని మంత్రి బదులిచ్చారు. పాకిస్థాన్ దౌత్యవేత్త ఒకరు ఆందోళనలకు మద్దతుగా తన ప్రొఫైల్ పిక్‌ను నిరంతరం మారుస్తున్నారని తెలిపారు. బంగ్లాదేశ్‌లో నాటకీయ పరిణామాలను ఢిల్లీ ముందుగానే ఊహించిందా? అని ప్రశ్నించగా, పరిస్థితిని భారత్ పర్యవేక్షిస్తోందని మంత్రి బదులిచ్చారు. పొరుగు దేశంలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించడంలో ఎన్‌డిఎ ప్రభుత్వానికి కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు తమ పూర్తి మద్దతును ప్రకటించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

కేబినెట్ భేటీ

ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన భద్రతపై కేబినెట్ కమిటీ సమావేశమై బంగ్లాదేశ్‌లో పరిస్థితిని అంచనా వేసింది. మోడీతో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సమావేశానికి హాజరయ్యారు. మంత్రి జైశంకర్ బంగ్లాదేశ్ పరిస్థితిపై ప్రధానికి వివరించారు. కేంద్ర మంత్రి జైశంకర్ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కూడా సమావేశమయ్యారు.

ప్రపంచదేశాల ఆందోళన

ఢాకా : రిజర్వేషన్ల వ్యతిరేక ఆందోళనల నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి, భారత్‌కు చేరుకున్నారు. అదే సమయంలో సోమవారం బంగ్లాదేశ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. మరో వంద మందికిపైగా మరణించగా, వేలాదిమంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. వీరిలో అత్యధిక శాతం మంది బుల్లెట్ గాయాలయ్యాయి. కాగా, బంగ్లాదేశ్‌లో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు ప్రపంచ దేశాలు ప్రకటించాయి.

ఢాకాలో ప్రధాని నివాస భవనం వద్ద శుభ్రం చేస్తున్న సైన్యం

హసీనా రాజీనామా ప్రజల శక్తిని రుజువుచేస్తోందని ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) అధ్యక్షుడు తారిఖ్ రెహమాన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛకు భద్రత కల్పించే ప్రజాస్వామ్య, అభివృద్ధి చెందిన దేశంగా బంగ్లాదేశ్‌ను పునర్‌నిర్మించాలని కోరారు. ప్రస్తుతం ఆయన బ్రిటన్‌లో ప్రవాసంలో ఉన్నారు.

భారత్ : భారత ప్రభుత్వం బంగ్లాదేశ్‌తో ఉన్న 4,096 కి. మీ సరిహద్దుల్లో హైఅలర్ట్ జారీ చేసింది.

ఐరాస : బంగ్లాదేశ్ ప్రజల పక్షాన నిలిచామని, వారికి పూర్తి సంఘీభావం తెలుపుతున్నట్లు ఐరాస పేర్కొంది. హింసాత్మక పరిస్థితులపై పూర్తి స్వతంత్ర, నిష్పాక్షికమైన, పారదర్శకమైన దర్యాప్తు చేపట్టాలని పిలుపునిచ్చింది.

బ్రిటన్ : బంగ్లాదేశ్‌లో హింసాత్మక పరిస్థితుల మృతులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ ప్రతినిధి పేర్కొన్నారు. ఇది పూర్తిగా ఆమోదయోగ్యం కాదని అన్నారు. శాంతియుత నిరసనల హక్కుని రక్షించాలని, హింసకు తావివ్వకూడదని అన్నారు. అరెస్టయిన ఆందోళనకారులను విడుదల చేయాలని అధికారులకు సూచించారు. విచారణ కోసం తగిన ప్రక్రియను అనుసరించాలని ఓ ప్రకటనలో తెలిపారు.

గత కొన్ని వారాలుగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులపై ఐరాస నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ పేర్కొన్నారు.

జర్మనీ : దేశంలో నెలకొన్న అశాంతి దృష్ట్యా బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య విలువలను కొనసాగించడం ముఖ్యమని ఫెడరల్ విదేశాంగ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

యూరోపియన్ యూనియన్ : బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పాలనకు "క్రమబద్ధమైన మరియు శాంతియుతమైన" మార్పు రావాలని పిలుపునిచ్చింది.

కెనడా : బంగ్లాదేశ్‌లో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘనను ఖండిస్తున్నట్లు కెనడా విదేశాంగ శాఖ పేర్కొంది. ఆందోళనకారులపై సైన్యాన్ని ప్రయోగించడం, నిర్బంధ అరెస్టులు, మరణాలు, చిత్రహింసలను ఖండిస్తున్నామని తెలిపింది.

బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధం: యూనస్

ఢాకా : తాత్కాలిక ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుగా బాధ్యతలు చేపట్టేందుకు నోబెల్ బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ సుముఖత తెలిపారు. దీనిపై ఆయన స్పందిస్తూ "విద్యార్థులు తీవ్రంగా ఆందోళనలు చేస్తున్నారు. అందుకు వారు మూల్యం కూడా చెల్లించారు. విద్యార్థులే ఇంతలా త్యాగాలు చేస్తే, నేను కూడా కొంత బాధ్యత తీసుకుంటాను. తాత్కాలిక ప్రభుత్వానికి ముఖ్యసలహాదారుగా వుంటాను." అన్నారు.

మహమ్మద్ యూనస్ ఎవరు

తాత్కాలిక ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుగా నియమించాలని విద్యార్థి నేతలు కోరుతున్న మహమ్మద్ యూనస్ బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్‌లో 1940లో జన్మించారు. ఆయన ఒక బ్యాంకర్, ఆర్థికవేత్త, పౌర సమాజ నేతగా ఉన్నారు. మైక్రోక్రెడిట్, మైక్రో ఫైనాన్స్‌లో చేసిన కృషికి గాను నోబెల్ శాంతి బహుమతిని అందుకోవడంతో ఆయన అంతర్జాతీయ గుర్తింపు పొందారు. యూనస్ 2009లో యునైటెడ్ స్టేట్స్ ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్, 2010లో కాంగ్రెషనల్ గోల్డ్ మెడల్‌తో సహా అనేక ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. 2012 నుంచి 2018 వరకు స్కాట్లాండ్‌లోని గ్లాస్గో కాలెడోనియన్ విశ్వవిద్యాలయానికి చాన్స్‌లర్‌గా పనిచేశారు. గతంలో చిట్టగాంగ్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గానూ పనిచేశారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించినందుకు యూనస్‌కు ఈ ఏడాది జనవరిలో కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

అమెరికా సుద్దులు !

దేశంలో కల్లోల పరిస్థితులు నెలకొన్న సమయంలో ఏర్పడే తాత్కాలిక ప్రభుత్వం ప్రజాస్వామ్య సూత్రాలకు అనుగుణంగా వుండాలంటూ అమెరికా హితవు పలికింది. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వాన్ని కూలదోయడంలో అమెరికా హస్తం కూడా ఉందని వార్తలొస్తున్నాయి. దేశ ప్రజల సంకల్పానికి తగినట్లుగా, చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్య సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రభుత్వం ఏర్పడాలని చెబుతోంది. ప్రభుత్వ భవితవ్యాన్ని నిర్ణయించేది అక్కడి ప్రజలేనని వ్యాఖ్యానిస్తూ, తాత్కాలిక ప్రభుత్వాన్ని స్వాగతించింది.

బంగ్లా మాజీ ప్రధానికి ఆశ్రయం ఎక్కడ?

ఢాకా : ఒక రోజంతా అనిశ్చితి, ఉద్రిక్తతలు కొనసాగిన అనంతరం బంగ్లాదేశ్‌లో పరిస్థితులు అదుపులోకి తీసుకురావడానికి సైన్యం ప్రయత్నిస్తోంది. మంగళవారం నాడు కొంత ప్రశాంతత నెలకొంది. పోలీసులు, జవాన్లు వీధుల్లో గస్తీ తిరుగుతున్నారు. కొన్ని పాఠశాలలను కూడా తెరిచారు. నిరసనల కారణంగా దీర్ఘకాలంగా స్కూళ్లు పనిచేయడం లేదు. బస్సులు, ఇతర ప్రజా రవాణా అంతా సాధారణంగానే కొనసాగింది. వర్తక వ్యాపారాలు జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు పనిచేశాయి. హసీనా ప్రైవేటు నివాసం సుధా సదన్, ఇతర సంస్థలపై దాడులు జరిగాయి. నిప్పంటించి విధ్వంసకాండకు దిగారు. మంత్రుల నివాసాలు, వారి కార్యాలయాలన్నీ దాడులకు లక్ష్యాలుగా మారాయి. ఢాకాలో, వెలుపల పలు ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలపై పార్టీ ఎంపీలు, నేతల నివాసాలపై దాడులు జరిగాయి.

లండన్ కాకపోతే ఎక్కడ ?

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రస్తుతం ఆమె భారత ఇంటలిజెన్స్ ఏజెన్సీల రక్షణలో ఉన్నారు. రాజకీయ శరణార్థిగా యుకెలో ఆశ్రయం కోరినట్లు సమాచారం. బ్రిటన్ ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేవరకు ఆమె భారత్‌లో ఉండేందుకు తాత్కాలిక అనుమతులు ఇచ్చినట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. గత రెండు వారాలుగా అల్లర్ల కారణంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, ప్రాణనష్టంపై ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో దర్యాప్తు జరిపించాలని యుకె విదేశాంగ కార్యదర్శి అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇందులో షేక్ హసీనాకు ఆశ్రయమిచ్చే అంశాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. హసీనా సోదరి రెహానా యుకె పౌరురాలు. ఆమె కుమార్తె తులిప్ సిద్దిఖీ ప్రస్తుతం లేబర్ పార్టీ తరపున పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం లేబర్ పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో, హసీనా బ్రిటన్ ప్రభుత్వాన్ని ఆశ్రయం కోరినట్లు తెలుస్తోంది.

తనకు ఆశ్రయం కల్పించడానికి బ్రిటన్ అంగీకరించని పక్షంలో యుఎఇ, సౌదీ అరేబియా వంటి దేశాలతో పాటూ తన ఇతర కుటుంబ సభ్యులు నివసిస్తున్న ఫిన్లాండ్, భారత్, అమెరికాలను కూడా హసీనా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ఉన్నత పదవుల పునర్వ్యవస్థీకరణ

బంగ్లాదేశ్ సైన్యంలో ఉన్నత పదవుల్లో పెద్ద ఎత్తున పునర్వ్యవస్థీకరణ జరిగింది. జాతీయ టెలికమ్యూనికేషన్ పర్యవేక్షణ కేంద్రం (ఎన్‌టిఎంసి) డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ జియావుల్ అషన్‌ను సర్వీసు నుండి తొలగించారు. ఇంకా అనేక మార్పులు చేపట్టారు.

హోటల్‌కు నిప్పు పెట్టిన ఘటనలో 24కి చేరిన మృతులు

విద్యార్థుల ఆందోళన సందర్భంగా చెలరేగిన హింసలో తాజాగా జషోర్ జిల్లాలో అవామీ లీగ్ ప్రధాన కార్యదర్శి షాహిన్ చక్లాదర్‌కి చెందిన జబీర్ ఇంటర్నేషనల్ హోటల్‌కు అల్లరి మూకలు నిప్పంటించిన ఘటనలో సజీవ దహనమైనవారి సంఖ్య 8 నుంచి 24కి పెరిగింది. అగ్నిమాపక సిబ్బంది హోటల్‌కు రాకుండా అల్లరి మూక అడ్డుకోవడంతో పరిస్థితి మరింత భయానకంగా తయారైంది. హసీనా రాజీనామా చేసి దేశం వీడిన రోజునే దేశంలో 113మంది మరణించారు. మాజీ ప్రధాని, కీలక ప్రతిపక్ష నేత ఖలీదా జియాతో సహా పలువురు ఖైదీలను విడుదల చేస్తూ అధ్యక్షుడు షహబుద్దీన్ ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థి ఉద్యమ కోఆర్డినేటర్లతో అధ్యక్షుడు భేటీ

13 మంది విద్యార్థి ఉద్యమ కోఆర్డినేటర్లతో అధ్యక్షుడు భేటీ

ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటాపై నిరసనలకు దిగిన యాంటీ డిస్క్రిమినేషన్ స్టూడెంట్ మూవ్‌మెంట్‌కి చెందిన 13మంది సభ్యుల బృందంతో అధ్యక్షుడు షహబుద్దీన్ మంగళవారం భేటీ అయ్యారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, తాత్కాలిక ప్రభుత్వ రూపురేఖలు, తీరుతెన్నులపై వారు చర్చించినట్లు స్థానిక పత్రిక పేర్కొంది.

రాజకీయ ముఖచిత్రాన్ని మార్చిన విద్యార్థి ఆందోళన

జులైలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా డాకా యూనివర్శిటీ సోషియాలజీ విద్యార్థి నహిద్, మరికొందరు విద్యార్థులు చేసిన చిన్న ఆందోళన ఉద్యమంగా మారి ఏకంగా ప్రధాని హసీనాను పదవీచ్యుతురాలిని చేసింది. జులైలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నహిద్ ఇస్లామ్ (26), మరికొందరు విద్యార్థులు ఆందోళన చేస్తుండటంతో పోలీసులు అరెస్టు చేశారు. బంగ్లాదేశ్ పతాకాన్ని నుదుట చుట్టు కొని తరచూ ఆందోళనల్లో మీడియాకు కనిపించాడు.

సరిహద్దు రాష్ట్రాలు అప్రమత్తం

బంగ్లా సరిహద్దు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. మేఘాలయలోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి నిరవధిక కర్ఫ్యూ విధిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బంగ్లాలో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా రెచ్చగొట్టే వీడియోలు షేర్ చేయొద్దని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

రాహుల్ గాంధీతో ఎస్‌కెఎం నేతలు భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలు భేటీ అయ్యారు. మంగళవారం పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కార్యాలయంలో ఎస్‌కెఎం నేతలు హన్నన్ మొల్లా, రామిందర్ సింగ్, బల్బీర్ సింగ్ రాజేవాల్, సత్యవాన్, ప్రేమ్‌సింగ్, గెహ్లాట్, తజేందర్ సింగ్ విర్క్, దర్శన్‌పాల్, సునీలం, రాజన్ క్షీర్‌సాగర్, అవిక్ సాహా కలిశారు. ఈ సందర్భంగా దేశంలోని రైతులు సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలు జైరాం రమేష్, కెసి వేణుగోపాల్, స్వరాజ్ ఇండియా నేత యోగేంద్ర యాదవ్ తదితరులు ఉన్నారు.

132 మందిపై కేసులు.. ఒకరికే శిక్ష

- ఐదున్నరేళ్లలో ఐదుగురిపైనే ట్రయల్ పూర్తి
- రాజ్యసభలో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజకీయ నేతలను బెదిరించడానికి, బ్లాక్‌మెయిల్ చేయడానికి మనీలాండరింగ్ కేసులు (పిఎంఎల్‌ఎ)ను కేంద్రప్రభుత్వం ఉపయోగిస్తోన్నట్లు తేటతెల్లమైంది. ఐదున్నరేళ్లలో 132 మంది ప్రస్తుత, మాజీ ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలపై మనీలాండరింగ్ కేసులు నమోదు చేయగా, ఐదుగురిపైనే విచారణ పూర్తయిందని, ఒకరికే శిక్ష పడిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. మంగళవారం రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 132 కేసుల్లో ఐదుగురిపైనే ట్రయల్ పూర్తయిందని, ఒకరిపైనే నేరం రుజువై శిక్ష పడిందని తెలిపారు.

తొమ్మిదేళ్లలో 8,719 యుఎపిఎ కేసులు

తొమ్మిదేళ్లలో 8,719 యుఎపిఎ కేసులు నమోదయ్యాయని కేంద్ర హోం సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2024 నుంచి 2024 వరకు పిఎంఎల్‌ఎ కేసులు 5,297 నమోదు చేశారు. 2024 నుంచి 2022 వరకు 8,719 పిఎంఎల్‌ఎ కేసులు నమోదు చేశారు.

విశాఖ పోర్టు సామర్థ్యం పెరుగుదల, 15 ప్రాజెక్టుల పూర్తి

విశాఖపట్నం పోర్టు 15 ప్రాజెక్టులను పూర్తి చేసిందని కేంద్ర పోర్టు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. రాజ్యసభలో వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంతి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

విశాఖ పోర్టు రూ.1,354.73 కోట్ల విలువైన మొత్తం 26 ప్రాజెక్టులను చేపట్టగా, అందులో 15 ప్రాజెక్టులను పూర్తి చేసిందని, ఇంకా 11 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని తెలిపారు. విశాఖపోర్టు సామర్థ్యం ఉపయోగం (కెపాసిటి యుటిలైజేషన్)లో పెరుగుదల ఉందని, 2020-21లో 52 శాతం నుంచి ప్రస్తుతం 59.1 శాతానికి సామర్థ్యానికి పెరిగిందని తెలిపారు.

బీమా పాలసీలపై జిఎస్‌టి తగ్గించాలి

- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై ఉన్న 18 శాతం జిఎస్‌టిని తగ్గించాలని ప్రతిపక్ష ఇండియా ఫోరం పార్టీల సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభానికి ముందు ఆందోళన చేపట్టారు. పార్లమెంట్ భవనం మకరద్వారం ముందు 'టాక్స్ టెర్రరిజం' ప్లకార్డులను ప్రదర్శించి, జిఎస్‌టి తగ్గించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఆందోళనలో లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ఎన్‌సిపి అధినేత శరద్ పవార్, సిపిఎం ఎంపిలు జాన్ బ్రిట్టాస్, వి.శివదాసన్, అమ్రారామ్, రాధాకృష్ణన్, వెంకటేషన్, టిఎంసి, ఆప్, కాంగ్రెస్, ఎస్‌పి, ఆర్‌జెడి, డిఎంకె తదితర పార్టీల ఎంపిలు పాల్గొన్నారు. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జిఎస్‌టి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

వయనాడ్ ప్రమాదంలో 53 మంది విద్యార్థులు గల్లంతు

- 392కు పెరిగిన మృతులు

తిరువనంతపురం : వయనాడ్ కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో 53 మంది పాఠశాల విద్యార్థులు గల్లంతయ్యారని, లేదా మరణించి ఉంటారని కేరళ ప్రభుత్వం తెలిపింది. వయనాడ్‌లో మంగళవారం రాష్ట్ర సాధారణ విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టీ విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని తెలియజేశారు. ముగ్గురు విద్యార్థులు తమ తల్లిదండ్రులు గల్లంతయ్యారని ఫిర్యాదు చేశారని చెప్పారు. 49 మంది విద్యార్థుల కుటుంబాలకు చెందిన ఇళ్లు పూర్తిగా ధ్వంసం కావడం లేదా పాక్షికంగా దెబ్బతినడం జరిగిందని చెప్పారు. మెప్పాడిలోని వొకేషనల్ హైయర్ సెకండరీ పాఠశాల, వెల్లార్‌మలలోని బాలికల లోయర్ ప్రైమరీ పాఠశాల పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రభుత్వం త్వరలో వీటిని పునర్నిర్మిస్తుందని వెల్లడించారు. కొండచరియలు విరిగిపడిన బాధితుల కోసం ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించిన మోడల్ టౌన్‌షిప్‌లోనే ఈ పాఠశాలలను ప్రభుత్వం నిర్మించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఈ ప్రమాదంలో అనేక మంది విద్యార్థులు తమ కంప్యూటర్లు, సర్టిఫికెట్లు, పాఠ్యపుస్తకాలు, ఇతర స్టడీ మెటీరియల్‌లను పోగొట్టుకున్నారని, ప్రభుత్వం వీటిని అందిస్తుందని చెప్పారు. బాధిత ప్రాంతాల్లో విద్యార్థులకు ఫస్ట్ టెర్మ్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసినట్లు తెలిపారు.

మెప్పాడి ప్రాంతంలో సహాయక చర్యలు

ప్రస్తుతం పునరావాస కేంద్రాలుగా ఉపయోగిస్తున్న పాఠశాలల్లో వచ్చే 20 రోజుల్లో తరగతులను పున:ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు.

ప్లాంటేషన్ కార్మికులకు ఆర్థిక సాయం

కొండచరియలు విరిగిపడి జీవనోపాధి కోల్పోయిన ప్లాంటినేషన్ కార్మికులకు కేరళ ప్రభుత్వం ఆర్థిక సహాయం అందచేస్తుందని మంత్రి శివన్‌కుట్టీ తెలిపారు. కార్మిక శాఖ ద్వారా ప్రాథమికంగా రూ.లక్ష చొప్పున ఒక్కొక్క కార్మికుడికి అందజేస్తామని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు కూడా ఈ పథకం వర్తింపజేస్తామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరిన ప్లాంటేషన్ కార్మికుల చికిత్స వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి చెప్పారు.

392కు చేరిన మృతుల సంఖ్య

వయనాడ్ ప్రమాదంలో మృతుల సంఖ్య మంగళవారానికి 392కు చేరుకుంది. ఇంకా 180 మంది అచూకీ తెలియాల్సి ఉంది. ఈ వివరాలను కేరళ ఎడిజిపి (శాంతిభద్రతలు) ఎంఆర్ అజిత్ కుమార్ తెలిపారు. ప్రమాద ఘటనలో సహాయక, గాలింపు కార్యక్రమాలు ఎనిమిదో రోజైన మంగళవారం కూడా కొనసాగినట్లు చెప్పారు. సహాయక, గాలింపు కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయని, తరువాత దశల్లో సాధారణంగా చేరుకోలేని ప్రాంతాలపై దృష్టి పెడతామని తెలిపారు.

జలరవాణాకు మాస్టర్‌ప్లాన్

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలని అన్నారు. ఎపి ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు వెంటనే పూర్తిచేయాలని,

వేగంగా ఎయిర్‌పోర్టులు...ఎయిర్ స్ట్రిప్‌లు

వీటితోపాటు దగదర్తి, కుప్పం, నాగార్జునసాగర్ ఎయిర్‌పోర్టులు, ఎయిర్‌స్ట్రిప్‌ల నిర్మాణంతోపాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట ఎయిర్‌పోర్టు నిర్మాణం కూడా చేపట్టాలని ఆదేశించారు. గతంలో మూలపేట పోర్టుకు భూసేకరణ కూడా పూర్తయిందని, వైసిపి ప్రభుత్వం నిలిపేసిందని తెలిపారు. మళ్లీ ఎయిర్‌పోర్టుల నిర్మాణం కార్యరూపం దాల్చాలని తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రి, కాకినాడ జిల్లా తునిలోనూ ఎయిర్ పోర్టులు నిర్మించాలని సూచించారు. కర్నూలు ఎయిర్‌పోర్టులో ఫ్లైయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ వంటి సంస్థలను తీసుకురావాలన్నారు. ఎయిర్‌పోర్టుల ద్వారా సరుకు రవాణా చేసేలా ప్రాజెక్టులను రూపకల్పన చేయాలని సూచించారు.వాటన్నిటినీ నేషనల్ హైవేకు అనుసంధానం చేయాలని తెలిపారు. అదే విధంగా ఎపి ఎవియేషన్ కార్పొరేషన్‌ను జిఏడి పరిధిలోకి, ఎపి డిజిటల్ కార్పొరేషన్‌ను ఐఅండ్‌పిఆర్ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ఎపిటవర్స్ కార్పొరేషన్‌ను ఎపి స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్‌లో విలీనం చేయాలని పేర్కొన్నారు. మంచి లక్ష్యంతో ఏర్పాటుచేసిన ఫైబర్‌నెట్‌ను రూ.1258 కోట్ల అప్పుల్లోకి నెట్టారని తెలిపారు. సెట్‌టాప్ బాక్సు ద్వారా రూ.149కే టివి, ఇంటర్‌నెట్ అందిస్తే దాన్ని వైసిపి ప్రభుత్వం పాడుచేసిందని వివరించారు. అలాగే కంటెంట్, డ్రోన్, టవర్స్, గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్లను గాడిలో పెట్టి సేవలు పునరుద్ధరించాలని తెలిపారు. అలాగే ఆర్‌టిజి సెంటర్లను పూర్తి చేసి సిసి కెమెరా నెట్‌వర్కు వాటికి అనుసంధానం చేయాలని సూచించారు. సమీక్షలో మంత్రి బి.సి.జనార్ధనరెడ్డి, సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాదు, అధికారులు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేరళ ప్రజలకు జేజేలు

(మొదటిపేజీ తరువాయి)

మోడీ వ్యవహరిస్తున్నారు. బిజెపి మెజారిటీ వున్న రాష్ట్రాల అసెంబ్లీల్లో మైనారిటీలను దారుణంగా లక్ష్యం చేసుకుంటూ కొత్త చట్టాలను రూపొందిస్తున్నారు. ఆ రకంగా మతోన్మాద పోకడలకు మరింత పదును పెడుతున్నారు. కన్వర్ యాత్రా మార్గంలో దుకాణాదారులు, వీధి వ్యాపారులు తప్పనిసరిగా తమ పేర్లు వున్న ఫలకాలను ప్రదర్శించాలని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ప్రకటించాయి. మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా మతోన్మాద ధోరణులు పెచ్చరిల్లేలా చేయడం ఈ ఆదేశాల లక్ష్యంగా వుంది. అయితే ఈ ఉత్తర్వుల అమలుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. కులాంతర, మతాంతర వివాహాలను లక్ష్యంగా చేసుకుంటూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చట్టవిరుద్ధమైన మతమార్పిడి (సవరణ) బిల్లు, 2024ను తీసుకువచ్చింది. ఇలాంటి వివాహాలు చేసుకున్నవారికి శిక్షను పదేళ్ల నుండి యావజ్జీవం వరకు పెంచింది.

అస్సాంలో, ముస్లింలు, హిందువుల మధ్య 'భూ జిహాద్'గా పేర్కొంటున్న భూమి క్రయవిక్రయాలను నివారించేందుకు చట్టాన్ని తీసుకువచ్చారు. ముఖ్యమంత్రి అనుమతితోనే ఇటువంటి లావాదేవీలు జరగగలవు! యుపి తరహాలోనే లవ్ జిహాద్‌గా పేర్కొనే మతాంతర వివాహాలకు యావజ్జీవ శిక్షను ప్రవేశపెట్టే యోచన చేస్తున్నారు.

మహారాష్ట్రలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం మహారాష్ట్ర ప్రత్యేక ప్రజా భద్రతా బిల్లును ప్రవేశపెట్టింది. పట్టణ ప్రాంత నక్సలిజాన్ని అణచివేసే పేరుతో అన్ని రకాల అసమ్మతులను నేరపూరితం చేయాలని ఈ బిల్లు కోరుతోంది. ఇది యుఎపిఎ కన్నా మరింత నిరంకుశమైనది.

బంగ్లాదేశ్ పార్లమెంటు రద్దు

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్ మేరకు మాజీ ప్రధాని, ప్రతిపక్ష బిఎన్‌పి నేత బేగం ఖలీదా జియాను గృహ నిర్బంధం నుంచి విడుదలజేశారు. ప్రజాతంత్రయుతంగా అధికార మార్పిడి జరగాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం హింసాత్మక ఘటనల్లో మరో 113 మంది చనిపోవడంతో గత నెల రోజులుగా సాగుతున్న ఈ ఆందోళనల్లో చనిపోయినవారి సంఖ్య 440కి పెరిగింది. రాజకీయ ఖైదీల విడుదల కోసం ఆ కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. గత కొన్ని రోజులుగా నెలకొన్న రాజకీయ కల్లోలం నుంచి బంగ్లాదేశ్ ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. మంగళవారం ఢాకా వీధుల్లో శాంతియుత పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయి. వాహనాల రాకపోకలు ఎప్పటిలానే సాగుతున్నాయి. నిలిచిపోయిన విమాన సర్వీసులను పునరుద్ధరించడంతో దుస్తుల తయారీ ఫ్యాక్టరీలు తిరిగి పనిచేయనారంభించాయి.

22 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

సాగర్‌కు భారీ వరద

- 22 గేట్లు ఎత్తి 3.55 లక్షల క్యూసెక్కులు విడుదల
- పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజికి 1.08 లక్షల క్యూసెక్కుల విడుదల
- డ్యామ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా నీటి ప్రవాహం వస్తుండడంతో మంగళవారం మొత్తం 22 గేట్లు ఎత్తి 3.55 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. 22 గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి నీటిని దిగువకు పంపుతున్నారు. శ్రీశైలం నుంచి 4.03 లక్షల క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేస్తుండగా సాగర్ జలాశయానికి 3.14 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. సాగర్ నుంచి కాల్వలకు 3.55 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.10 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసిలు కాగా ప్రస్తుతం నీటి నిల్వ 298 టిఎంసిలుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పులిచింతల గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 22.75 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 3.71 లక్ష క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ముందుగానే 1.08 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పులిచింతల నుంచి దిగువ ప్రకాశం బ్యారేజీకి వరద ప్రవాహం పెరగడంతో ప్రకాశం బ్యారేజీ గేట్లను బుధవారం ఎత్తనున్నారు. పరవళ్లు తొక్కుతున్న జలాశయం అందాలను చూసేందుకు భారీగా పర్యాటకులు తరలి వచ్చారు. దీంతో సాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాలన్నీ పర్యాటకులతో కిటకిటలాడింది. సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనుపు, బుద్ధ వనం, కొత్త వంతెన, పాత వంతెన తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. హిల్‌కాలనీ విజయవిహార్ అతిథి గహం వెనక ఉన్న నూతన లాంచీ స్టేషన్ నుంచి జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు నాలుగు లాంచీ ట్రిప్పులను పర్యాటక శాఖ నడుపుతోంది. సాగర్ డ్యామ్ పరిసరాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

శ్రీశైలానికి తగ్గిన ప్రవాహం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. సాయంత్రం ఆరు గంటలకు జలాశయం నీటి మట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 883.20 అడుగులకు చేరింది. నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసిలకు గాను 205.6627 టిఎంసిలుగా నమోదైంది. గడిచిన 24 గంటలలో కుడి, ఎడమ గట్టు జల విద్యుత్తు కేంద్రాలలో 30.325 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తిని చేశారు. ఎగువ జూరాల నుంచి 2,60,743 క్యూసెక్కులు, తుంగభద్ర నుండి 60,354 క్యూసెక్కులతో కలిపి మొత్తం 3,21,097 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి చేరుతుంది. దీంతో పది గేట్లను 12 అడుగుల మేర ఎత్తి సాగర్‌కు 3,11,790 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు.

89.34 మీటర్లు.. నేరుగా ఫైనల్‌కు

పారిస్ ఒలింపిక్స్‌లో తొలి ప్రయత్నంలోనే 89.34మీటర్లు విసిరి ఒలింపిక్స్‌లో తన పేర(87.58మీ.) ఉన్న రికార్డును బ్రేక్ చేసి ఫైనల్‌కు చేరాడు. ఒలింపిక్ ఫైనల్ కనీస అర్హత మార్క్ 84మీటర్లు కాగా.. గ్రూప్-ఎ, బి నుంచి మొత్తం ఏడుగురు త్రోవర్లు అర్హత మార్క్‌ను అందుకున్నారు. వీరందరిలోనూ అత్యధిక దూరం జావెలిన్‌ను త్రో చేసింది నీరజ్ చోప్రా మాత్రమే. కిషోర్ జెనా(భారత్)80.73మీ., నిరాశపర్చాడు. ఆగస్టు 8న జావెలిన్ త్రో ఫైనల్ జరగనుంది.

- రికార్డు పతకానికి అడుగు దూరంలో నీరజ్ చోప్రా
- రెజ్లింగ్ ఫైనల్‌కు వినేశ్ ఫోగాట్
- హాకీ సెమీస్‌లో ఓటమి, కాంస్యానికి నేడు స్పెయిన్‌తో ఢీ

పారిస్: భారత జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రా పారిస్ ఒలింపిక్స్‌లోనూ సత్తా చాటాడు. మంగళవారం జరిగిన గ్రూప్-బి క్వాలిఫికేషన్ రౌండ్‌లో నీరజ్ తొలి ప్రయత్నంలోనే జావెలిన్‌ను 89.34మీ, దూరం విసిరి ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. ఫైనల్‌కు చేరాలంటే కనీసం 84మీ. మార్క్ త్రోను చేయాల్సి ఉంది. ఈ గ్రూప్‌లో నీరజ్‌దే అగ్రస్థానం. చోప్రాతోపాటు తొలి ప్రయత్నంలోనే గ్రెనెడాకు చెందిన పీటర్స్ అండర్సన్ (88.63 మీ.) రెండో స్థానం, నదీమ్ ఆర్షాద్ (పాకిస్తాన్ 86.59మీ.) మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. బ్రెజిల్ అథ్లెట్ డా సిల్వా లూయిజ్ మారిసియో మూడో ప్రయత్నంలో 85.91 మీటర్లు విసిరి నాలుగో స్థానంలో నిలి చాడు. మల్డోవాకు చెందిన ఆండ్రియన్ మూడో ప్రయత్నంలో (84.13 మీ) ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించాడు. భారత్‌కు చెందిన మరో జావెలిన్ త్రోయర్ కిశోర్ జెనా ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయాడు. గ్రూప్-ఎలో జెనా తొలి ప్రయత్నంలో 80.73మీ. ప్రదర్శన చేశాడు. రెండో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. మూడో ప్రయత్నంలో జావెలిన్‌ను 80.21 మీటర్లు విసిరాడు.

8న జరిగే జావెలిన్ త్రో పతక రేసులో నిలిచిన వారు..

గ్రూప్-ఎ..		గ్రూప్-బి..	
1. వెబేర్(జర్మనీ)	87.76మీ.	1. నీరజ్ చోప్రా(భారత్)	89.34మీ.
2. యేగో(కెన్యా)	85.97మీ.	2. ఆండర్సన్ పీటర్స్(గ్రెనెడా)	88.63మీ.
3. వెడ్లెజిత్(ఛెచియా)	85.63మీ.	3. అర్షాద్ నదీమ్(పాకిస్తాన్)	86.59మీ.
		4. డా సిల్వా లూయిజ్(బ్రెజిల్)	85.91మీ.

ఫైనల్‌కు వినేశ్ ఫొగాట్

మహిళా రెజ్లర్ వినేశ్ ఫొగాట్ అదరగొట్టింది. మహిళల 50కిలోల ఫ్రీస్టైల్ విభాగం ఫైనల్‌కు చేరి పతకం ఖాయం చేసింది. దీంతో ఒలింపిక్స్‌లో ఫైనల్‌కు చేరిన తొలి మహిళా రెజ్లర్‌గా వినేశ్ ఫోగాట్ నిలిచింది. మంగళవారం జరిగిన సెమీస్‌లో ఫోగాట్ 5-0తో యూస్నీ లీస్ గుజ్మాన్(క్యూబా)ను ఓడించింది. అంతకుముందు క్వార్టర్స్‌లో వినేశ్ 7-5పాయింట్ల తేడాతో లివచ్ ఒక్సానా(ఉక్రెయిన్)పై విజయం సాధించింది. దీంతో ఒలింపిక్స్‌లో తొలిసారి సెమీస్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో ఆరంభంలో వినేశ్ 4-0 పాయింట్లతో ఆధిక్యతలో నిలిచింది. ఆ దశలో ప్రత్యర్థి లివచ్ గట్టి పోటీ ఇచ్చి స్కోరును 5-4గా నిలిచింది. చివర్లో వినేశ్ పుంజుకుని విజయం సాధించింది. అంతకుముందు డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్‌కు చెందిన సుసాకికి వినేశ్ షాక్ ఇచ్చింది.

నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన ఆమెను ప్రిక్వార్టర్స్‌లో 3-2 తేడాతో ఓడించింది. తొలుత 0-2తో వెనుకబడిన భారత రెజ్లర్ చివర్లో గొప్పగా పుంజుకుంది. ఆఖరి ఐదు సెకన్లలో మూడు పాయింట్లు సాధించి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. వినేశ్.. సెమీస్‌లో గెలిస్తే భారత్‌కు మరో పతకం ఖాయమవుతుంది. 2016 రియో ఒలింపిక్స్‌లో మోకాలికి తీవ్ర గాయమవడంతో వినేశ్ అర్ధంతరంగా నిష్క్రమించాల్సి వచ్చింది. టోక్యోలో ఆశలు రేపినా క్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. ఇప్పుడు పతకం గెలవ డానికి ఆమెకు సువర్ణావకాశం దొరికింది.

క్వార్టర్స్‌లో లివచ్(ఉక్రెయిన్)తో తలపడుతున్న ఫోగాట్



హాకీ సెమీస్‌లో భారత్‌కు నిరాశ.. ఫైనల్‌కు జర్మనీ, నెదర్లాండ్స్

పురుషుల హాకీ జట్టు సెమీఫైనల్లో జర్మనీ చేతిలో ఓటమి పాలైంది. హోరాహోరీగా సాగిన రెండో సెమీఫైనల్లో భారత్ 2-3గోల్స్ తేడాతో జర్మనీ చేతిలో ఓడింది. తొలి రెండు క్వార్టర్స్ ముగిసేసరికి భారత్ 1-2గోల్స్‌తో వెనుకబడ్డా.. మూడో క్వార్టర్‌లో భారత్ ఒక గోల్ చేయగా.. నాల్గో క్వార్టర్‌లో జర్మనీ మరో గోల్ కొట్టింది. దీంతో భారత్ 2-3గోల్స్‌తో వెనుకబడింది. చివర్లో భారత్ పుంజుకున్నా.. గోల్స్ కొట్టడంలో విఫలమైంది. మరో తొలి సెమీస్‌లో నెదర్లాండ్స్ జట్టు 4-0 గోల్స్ తేడాతో స్పెయిన్‌ను చిత్తుచేసింది. తొలి అర్ధభాగం ముగిసేసరికే 2-0గోల్స్‌తో ఆధిక్యతలో నిలిచిన నెదర్లాండ్స్ జట్టు... రెండో అర్ధభాగంలో మరో రెండు గోల్స్‌తో సత్తాచాటింది. జిప్ జాన్సెన్ (12వ ని.) కెప్టెన్ థియరీ బ్రింక్‌మన్ (20వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. 50వ ని.లో డ్యుకో టెల్‌గెన్‌క్యాంప్ నాల్గో గోల్ కొట్టాడు. బుధవారం జరిగే కాంస్య పతక పోరులో భారతజట్టు స్పెయిన్‌తో తలపడనుండగా.. నెదర్లాండ్స్, జర్మనీ జట్ల మధ్య స్వర్ణ పతక పోటీ జరగనుంది.

బ్యాటర్లు రాణిస్తేనే..

- నేడు శ్రీలంకతో చివరి వన్డే
- మధ్యాహ్నం 2.30గం॥కు

కొలంబో: భారత జట్టుకు శ్రీలంక గడ్డపై కఠిన సవాల్ ఎదుర్కోనుంది. టి20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన టీమిండియా.. వన్డే సిరీస్‌ను చేజార్చుకొనే ప్రమాదంలో పడింది. తొలి వన్డేలో గెలవాల్సిన మ్యాచ్‌ను టైగా ముగించిన భారత్.. రెండో మ్యాచ్‌లో 32 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. కెప్టెన్ రోహిత్ శర్మ రెండు మ్యాచుల్లో అర్ధ శతకాలతో గట్టి పునాది వేసినా అనూహ్యంగా రెండింటా ఓడడం హెడ్ కోచ్ గౌతం గంభీర్‌ను కలవరపెడుతోంది. పక్కా స్పిన్ పిచ్‌లను రెడీ చేసిన లంక మూడో వన్డేలో విజయంపై కన్నేయగా.. సిరీస్ సమం చేయడంపై రోహిత్ సేన దృష్టి సారించింది. ఒకవేళ మూడో వన్డేలోనూ గెలిస్తే లంక 27ఏళ్ల తర్వాత భారత్‌పై ద్వైపాక్షిక సిరీస్ కైవసం చేసుకోనుంది.

జట్లు(అంచనా)..

ఇండియా: రోహిత్(కెప్టెన్), గిల్, కోహ్లి, రాహుల్, పంత్(వికెట్ కీపర్), దూబే, అక్షర్, కుల్దీప్, సిరాజ్, అర్ష్‌దీప్, సుందర్/పరాగ్.

శ్రీలంక: అసలంక(కెప్టెన్), నిస్సంక, ఫెర్నాండో, కుశాల్ మెండీస్(వికెట్ కీపర్), సమరవిక్రమ, లైనగే, వెల్లెలిగే, హసరంగ, తీక్షణ, అసితా, కరుణరత్నే/ధనుంజయ.

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఫిజి అత్యున్నత పౌర పురస్కారం

సువా : ప్రస్తుతం ఫిజి పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం కంపానియన్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ఫిజిని మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ రెండు దేశాల మధ్య సంబంధాలను కొనియాడారు. ఫిజితో మరింత బలమైన, దృఢమైన సంబంధాలను ఏర్పాటు చేసుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. ఫిజి పార్లమెంట్‌ను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. విస్తీర్ణం పరంగా భారత్, పిజిల మధ్య చాలా వ్యత్యాసం ఉన్నప్పటికీ ఈ రెండు దేశాల్లోనూ శక్తివంతమైన ప్రజాస్వామ్యం వంటి అనేక ఉమ్మడి అంశాలు ఉన్నాయని అన్నారు. ఫిజి, న్యూజిలాండ్, తైవాన్-లెస్టే దేశాల్లో ఆరు రోజుల పర్యటన కోసం సోమవారం రాష్ట్రపతి న్యూఢిల్లీ నుంచి బయలుదేరి వెళ్లారు.

అల్ట్రాటెక్ ఘటనలో మరో కార్మికుడు మృతి

- ఐదుకు చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తి - జగ్గయ్యపేట (ఎన్‌టిఆర్ జిల్లా)

గోపీ నాయక్ (పాతచిత్రం)

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామ సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రమాదంలో గాయపడిన మరో కార్మికుడు సోమవారం రాత్రి మరణించారు. గత నెల 7వ తేదీన ప్రమాదం జరిగి 16 మంది తీవ్రంగా గాయపడగా, వీరిలో నలుగురు మరణించిన విషయం తెలిసిందే. 29 రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న బూదవాడ గ్రామానికి చెందిన గుగులోతు గోపీ నాయక్ (35) హైదరాబాద్ అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆయనను మెరుగైన చికిత్స కోసం వారం రోజుల క్రితం హైదరాబాద్ తరలించగా, అక్కడ మరణించాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బూదవాడ గ్రామంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. గోపీ నాయక్ మృతితో అల్ట్రాటెక్ మృతుల సంఖ్య ఐదుకు చేరింది.

పరాయి వస్తువు



రామాపురం అనే గ్రామంలో గోపి అనే అబ్బాయి ఉన్నాడు. గోపీది చాలా పేద కుటుంబం. గోపి స్నేహితులందరూ బాగా డబ్బు ఉన్నవాళ్లు. వారందరికీ ఇంట్లో ఏది కావాలంటే అది కొనిచ్చేవారు. కానీ గోపి వాళ్ళ ఇంట్లో అలా కాదు. తల్లీదండ్రీ కాయకష్టం చేసుకుంటే కానీ మూడు పూటలా భోజనం చేయలేని పరిస్థితి.

ఒక రోజు గోపీ స్నేహితులు అందరూ వాళ్ల ఇంట్లో కొనిచ్చిన ఖరీదైన బొమ్మలతో ఆడుకుంటున్నారు. వాటిల్లో వీడియో గేమ్ సెట్ గోపీకి తెగ నచ్చేసింది. తను కూడా అందులో గేమ్స్ ఆడుకోవాలని అనుకున్నాడు. కానీ ఎవరూ తనకి ఇవ్వలేదు. ఒక్కసారి ఇవ్వమని ఎంత బతిమాలినా ఇవ్వకుండా 'కావాలంటే నువ్వే కొనుక్కో' అని అవమానించారు.

గోపీ ఏడుస్తూ ఇంటికి బయల్దేరాడు. దారి మధ్యలో తనకి ఓ ఖరీదైన సెల్‌ఫోన్ దొరికింది. అందులో ఓ వీడియో గేమ్ ఆన్ చేసి ఉంది. అది చూడగానే గోపీకి ఎక్కడలేని సంతోషమేసింది. సెల్‌ఫోన్ పట్టుకుని చుట్టూ చూశాడు. అక్కడ ఎవరూ లేరు. 'అంటే ఈ ఫోను ఎవరిదీ కాదన్నమాట. ఎవరో ఇక్కడ కావాలనే పారేశారు' అనుకుంటూ ఇంటికి వెళ్లాడు.

పని నుంచి అమ్మ ఇంటికి రాగానే, తనకి సెల్‌ఫోను దొరికిన విషయాన్ని చెప్పాడు. అప్పుడు వాళ్ల అమ్మ గోపీని చాలా కోప్పడింది. 'మనది కాని వస్తువు ఎంత ఖరీదైనది అయినా సొంతం చేసుకోకూడదు. ఆ వస్తువును పారేసుకున్నవారు ఎంత బాధపడుతున్నారో. ఇప్పుడు కాకపోయినా కొంత సేపటికి అయినా సెల్‌ఫోన్ యజమాని అక్కడికి వస్తాడు. నువ్వు అక్కడికి వెళ్లి ఆ ఫోను వాళ్లకి ఇచ్చేసేయ్' అని చెప్పింది. అమ్మ మాటలు గోపీకి బాగా నచ్చాయి. పరాయి వస్తువుపై ఇంకెప్పుడూ మోజు పెంచుకోకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు. సెల్‌ఫోను తీసుకుని అది దొరికిన వైపు వెళ్లాడు. ఇప్పుడు గోపీకి వీడియో గేమ్స్ ఆడాలని ఎంతమాత్రమూ లేదు. ఫోను యజమానికి వీలైనంత త్వరగా దాన్ని అందించాలని అనుకుంటున్నాడు.

నీతి : రోడ్డు మీద దొరికిన వస్తువును నిజాయితీగా వారికే అప్పగించాలి

- పి హర్షవర్ధన్,
ఏడవ తరగతి,
జెడ్పిహెచ్‌ఎస్ రాంపూర్,
మండలం నిజాంపేట్, మెదక్ జిల్లా.
94417 62105.

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని ఆకారాలతో ఒక పజిల్ ఇచ్చాం. వాటిల్లో ఖాళీ గళ్లను మీరు నింపాలి. అయితే ఏ వరుసలోనూ ఒకేలాంటివి రెండు ఉండకూడదు మరి!

నేను గీసిన బొమ్మ

పి.సంగీత,
8వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్
చిన్నగొట్టిముక్కల,
శివంపేట జిల్లా,
మెదక్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68